ప్రజాశక్తి

మంగళవారం 21 మార్చి 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

అప్పుల బాధతో

రైతు ఆత్మహత్య

పురుగుల మందు తాగి.. బలవన్మరణం



కోటిరెడ్డి(ఫైల్)

ప్రజాశక్తి-మార్కాపురం

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మార్కాపురం మండలం, గజ్జలకొండ గ్రామ పంచాయతీలోని మాలపాటిపల్లె గ్రామానికి చెందిన రైతు గొలమారి కోటిరెడ్డి(51) నాలుగు రోజుల క్రితం పురుగులమందు తాగాడు. ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఈ నెల 18న సాయంత్రం మృతిచెందాడు. రైతు గొలమారి కోటిరెడ్డికి మాలపాటిపల్లెలో నాలుగు ఎకరాల పొలం ఉంది. దాంతో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకున్నాడు. ఆరున్నర ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాడు. రెండేళ్లుగా వర్షాభావం వెన్నాడింది. దీంతో వ్యవసాయ బోరు బావి ఒట్టిపోయింది. పంటను దక్కించుకునేందుకు నాలుగు బోర్లు వేశాడు. నీరు లభించలేదు. గత ఏడాది, ఈ ఏడాది కలిపి మిర్చి పంటపై పెట్టుబడులు రూ.10 లక్షలకు పైగా పెట్టారు. ఈ ఏడాది మిర్చికి ధర ఉందని, అప్పులు తీర్చవచ్చని భావించాడు. ఆరున్నర ఎకరంలో సాగుచేసిన మిర్చి పంట నిలువునా ఎండిపోయింది. పంటలపై పెట్టిన అప్పులు వడ్డీ రూపంలో రూ.15 లక్షల వరకు చేరింది. అప్పులు ఇచ్చిన వారు బాకీ తీర్చాలని ఒత్తిడి చేయడంతో నాలుగు రోజుల క్రితం పొలంలోనే పురుగుమందు తాగాడు. విషయం తెలుసుకున్న స్థానికులు వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందాడు. ఆదివారం సెలవు కావడంతో కోటిరెడ్డి మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. స్వగ్రామమైన మాలపాటిపల్లెలో కోటిరెడ్డి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. కోటిరెడ్డికి భార్య అనంతమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రభుత్వం బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంగన్‌వాడీల

అష్టదిగ్బంధనం

- విజయవాడ వెళ్లకుండా అడ్డుకొని స్టేషన్లకు తరలింపు
- ఉదయం నుంచి సాయంత్రం వరకూ అక్కడే నిర్బంధం
- స్టేషన్లలోనే బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన అంగన్‌వాడీలు



కురిచేడు పోలీస్‌స్టేషన్‌లో బైటాయించిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అంగన్‌వాడీలు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సోమవారం నాడు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమంపై ప్రభుత్వం నిర్బంధకాండ ప్రయోగించింది. పోలీసులను రంగంలోకి దించింది. విజయవాడ వెళుతున్న అంగన్‌వాడీలను ఎక్కడికక్కడే అడ్డుకున్నారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలోనే వారిని అడ్డగించారు. అక్కడ నుంచి బలవంతంగా పోలీసు వాహనాల్లో ఎక్కించి స్టేషన్లకు తరలించారు. ఒక్కో ప్రాంతం వారిని వేరే చోట్ల స్టేషన్లలో పెట్టారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకూ అంగన్‌వాడీలను పోలీస్‌స్టేషన్లలోనే నిర్బంధించారు. ప్రభుత్వ సేవలు నిర్వహించే అంగన్‌వాడీలకు కనీస మర్యాద కూడా ఇవ్వలేదు. మహిళలనే గౌరవం కూడా లేకుండా వారి వల్ల ఏదో ముప్పు వాటిల్లుతుందనే భయంతోనే ప్రభుత్వం ఇలా వ్యవహరించింది. జిల్లా నుంచి ఏదో మార్గంలో విజయవాడ వెళ్లిన వారిని కూడా అక్కడ అరెస్టులు చేసి స్టేషన్లకు తరలించారు. అంగన్‌వాడీ యూనియన్ నేత అన్నపూర్ణను అక్కడే అరెస్టు చేశారు. పోలీసు వాహనంలోనే తిప్పుతున్నారని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. జిల్లాలో స్టేషన్లన్నీ అంగనవాడీలతోనే నిండిపోయాయి. పిల్లలతోనూ కొందరు అంగన్‌వాడీలు ఆందోళనకు బయలుదేరారు. వీరిని కూడా స్టేషన్లలోనే ఉంచారు. మార్కాపురం, పొదిలి, వైపాలెం ప్రాంతాల నుంచి వెళుతున్న వారిని అడ్డుకున్నారు. కర్నూలు-గుంటూరు రహదారిలోనే చాలా వాహనాలను ఆపేశారు. మార్కాపురం, పొదిలి, కురిచేడు, త్రిపురాంతకం స్టేషన్లలో నిర్బంధించారు.



చీరాలలో పోలీస్‌స్టేషన్‌లోనే నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కురిచేడు స్టేషన్‌లోనే బైఠాయించి నిరసనలు వ్యక్తం చేశారు. పొదిలి స్టేషన్‌లోనూ చాలా మందిని నిర్బంధించారు. చీరాల రైల్వేస్టేషన్‌లో పెద్దఎత్తున అంగన్‌వాడీలను అడ్డుకున్నారు. అక్కడ నుంచి వీరిని కూడా స్టేషన్లకు తరలించారు. కందుకూరు ప్రాంతం, పొన్నలూరు మండలాలనుంచి వస్తున్న అంగన్‌వాడీలను జాతీయరహదారిలో అడ్డుకున్నారు. మద్దిపాడు స్టేషన్‌లో పెట్టారు. ఇలా ఎక్కడ చూసినా స్టేషన్లలో అంగన్‌వాడీలతో కిటకిటలాడిపోయాయి. విజయవాడకు ▶ 2లో

అసెంబ్లీలో

జిల్లా ఎమ్మెల్యేల మధ్య ఘర్షణ

- పోడియం వద్ద నిరసన తెలుపుతున్న కొండపి ఎమ్మెల్యే స్వామిపై దాడి
- ఎమ్మెల్యే సుధాకర్‌బాబు పోడియం వద్దకు వెళ్లడంతో గొడవ
- తోపులాటలో ఇద్దరూ కిందపడిపోయిన వైనం



ఎమ్మెల్యే స్వామిపై దాడిని ఖండిస్తూ ఒంగోలులో టిడిపి నేతల నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అసెంబ్లీలో జిల్లా ఎమ్మెల్యేల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అనూహ్య పరిణామాలు జరిగాయి. కొండపి ఎమ్మెల్యే, సంతనూతలపాడు ఎమ్మెల్యే మధ్య ఈ ఘర్షణ జరిగింది. ఇద్దరూ కిందపడిపోయారు. పోడియం వద్ద నిరసన తెలుపుతున్న కొండపి ఎమ్మెల్యే స్వామిపై జరిగిన దాడి నేపథ్యంలోనే ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. జీవో నెంబర్.1ని రద్దు చేయాలంటూ కొండపి ఎమ్మెల్యే వీరాంజనేయస్వామి వాయిదా తీర్మానం ఇచ్చారు. దీనిపై చర్చకు స్పీకర్ నిరాకరించారు. ప్రశ్నోత్తరాల పేరుతో అంగీకరించలేదు. దీంతో తెలుగుదేశం ఎమ్మెల్యేలు ప్లకార్డులతో పోడియం వద్దకు వెళ్లారు. కొండపి ఎమ్మెల్యే వీరాంజనేయస్వామి ప్లకార్డుతో స్పీకర్ ముందుకు వెళ్లారు. వెంటనే స్పీకర్ దాన్ని పక్కను నెట్టే యత్నం చేశారు. ఇంతలో చింతలపూడి ఎమ్మెల్యే ఎలీషా వెళ్లి స్వామిని పక్కకు లాగేయత్నం చేశారు. వెంటనే సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు కూడా వెళ్లి ఎలిషాకు మద్దతుగా స్వామిని లాగే యత్నం చేశారు. దీంతో స్వామి హఠాత్తుగా కిందపడిపోయారు. వెంటనే పక్కనే ఉన్న తెలుగుదేశం ఎమ్మెల్యేలు ఒకరిద్దరు జోక్యం చేసుకుని సుధాకర్‌బాబును అడ్డుకున్నారు. దీంతో ఆయన కూడా అదుపుతప్పి కిందపడిపోయారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత తలెత్తింది. అరుపులు, కేకలతో సభ దద్దరిల్లింది. ఈ గొడవకు సంబంధించిన దృశ్యాలు మాత్రం బయటకు రాలేదు. కొన్ని అసంపూర్తిగా ఉన్న ఫొటోలే బయటకు వచ్చాయి. సభ వాయిదా అనంతరం మళ్లీ ప్రారంభమైంది. సభ నుంచి ఒక రోజు పాటు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారు. అనంతరం తెలుగుదేశం ఎమ్మెల్యేలు సభలో జరిగిన గొడవలను మీడియాకు వెల్లడించారు. పోడియం వద్ద నిరసన తెలుపుతున్న తనపై వైసిపి ఎమ్మెల్యేలు దాడి చేశారని, కిందపడిపోయానని స్వామి వెల్లడించారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు తనను వెనుక నుంచి లాగడంతో కిందపడి పోయానన్నారు. ఆయనకు నియోజకవర్గంలో తీవ్రమైన వ్యతిరేకత ఉన్నందున దాన్నుంచి దృష్టి మళ్లించేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తనపై దాడి చేశారన్నారు. వీడియోలను బయటపెడితే ఎవరు దాడిచేశారో తెలుస్తుందన్నారు. దాడిని తెలుగుదేశం ఎమ్మెల్యేలు ఖండించారు. పోడియం ▶ 2లో

తండ్రిని చంపిన

కసాయికి జీవితఖైదు

తీర్పు ఇచ్చిన ఒంగోలు 7వ ఎడిజె న్యాయమూర్తి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

చెడు వ్యసనాలకు బానిసై.. జల్సాలకు అడిగినంత డబ్బు ఇవ్వలేదని కన్నతండ్రిని అత్యంత కిరాతకంగా హతమార్చిన కుమారుడికి జీవిత ఖైదు, రూ.2 వేలు నగదు జరిమానా విధిస్తూ ఒంగోలు ఏడో అదనపు జ్యూడిషియల్ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఈ మేరకు బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు.

మార్టూరు మండలం, బొబ్బేపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న విశ్రాంత అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ బత్తుల పరశురామారావుకి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరందరికీ వివాహాలు జరిపించిన పరశురామారావు ఆఖరి కుమారుడైన బత్తుల సురేష్‌బాబుతో కలిసి బొబ్బేపల్లి ఎస్సీ కాలనీలో నివసిస్తున్నారు. ఈ క్రమంలో తండ్రికి వచ్చే పింఛన్ డబ్బులను దౌర్జన్యంగా తీసుకుంటూ జల్సాలకు, చెడు వ్యసనాలకు సురేష్ అలవాటుపడటంతో కొడుకుని అదుపులోకి పెట్టడానికి పరశురామయ్య కఠినంగా వ్యవహరిస్తున్నాడు. ఈ నేపథ్యంలో 2020 జూన్ 13న ఎప్పటిలాగే తండ్రిని రూ.30 వేలు నగదు కావాలని ఒత్తిడి చేయడంతో తండ్రి నిరాకరించాడు. ఈ క్రమంలో విచక్షణ కోల్పోయిన సురేష్ అక్కడే ఉన్న జామాయిల్ కర్రతో తండ్రిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన పరశురామయ్య అక్కడిక్కడే మృతిచెందాడు. పోలీస్ శాఖకు చెందిన విశ్రాంత ఏఎస్ఐ మృతి చెందటంతో కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అప్పటి దర్యాప్తు అధికారి అయిన ఇంకొల్లు సీఐ రాంబాబు నేరస్తుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఆ తర్వాత దర్యాప్తు అధికారైన షేక్ అల్తాఫ్ హుస్సేన్ కోర్టులో ఛార్జ్‌షీట్ వేశారు. ఈ క్రమంలో కేసు తీవ్రతను గుర్తించిన బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కేసుని వేగవంతం చేయమని ఆదేశించడంతో పోలీసులు సాక్షులను సరైన సమయంలో కోర్టుకు హాజరుపరిచారు. అడిషనల్ పిపి సిహెచ్.రమేష్‌బాబు కోర్టులో వాదోపవాదాలు వినిపించి నిందితుడిపై మోపబడిన నేరాన్ని నిరూపించారు. ఒంగోలు ఏడో ఎడిజె న్యాయమూర్తి డి.అమ్మనరాజు నిందితుడైన బత్తుల సురేష్‌బాబుకు జీవితఖైదుతో పాటు రూ.2 వేలు నగదు జరిమానాగా చెల్లించాలని తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

అంగన్‌వాడీల అష్టదిగ్బంధనం

(మొదటిపేజీ తరువాయి)

పోకుండా అడ్డుకున్నారు. అయినా చాలామంది అక్కడకు చేరుకున్నారు. అరెస్టులతో అపలేరని హెచ్చరించారు. సిఐటియు నేతలను అరెస్టులు చేశారు. ముందుగానే నోటీసులు ఇచ్చారు. తెలుగుదేశం, వామపక్షాల నేతలను అక్కడక్కడా అడ్డుకున్నారు. మార్టూరు ప్రాంతంలోనూ అరెస్టులు జరిగాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగులు, చదువుకున్న యువత తీర్పుతో ప్రభుత్వంలో మార్పు వస్తుందని ఆశించినా అది కనిపించలేదు. మరుసటి రోజునే ప్రభుత్వం అంగన్‌వాడీలపై నిర్బంధం ఆందోళన కలిగిస్తోంది. ఉద్యోగుల్లో వ్యతిరేకతను అంగీకరిస్తున్న వైసిపి నేతలు ఇలాంటి చర్యలకు పాల్పడటం ఆలోచించాల్సిన అంశం. వారి కోసం ఏదో చేస్తామని చెప్పడం కూడా అబద్ధమేనా? అనే సందేహాలు కలుగుతున్నాయి. అంగన్‌వాడీలపై తీవ్ర నిర్బంధంపై యూనియన్ రాష్ట్ర కమిటీ కూడా నిరసనలకు పిలుపునిచ్చింది. అంగన్‌వాడీలపై పోలీసుల దాష్టీకాన్ని అన్ని రాజకీయపార్టీలు వ్యతిరేకించాయి.

రైల్వేస్టేషన్ నుంచి పోలీస్‌స్టేషన్‌కు..

చలో విజయవాడ కార్యక్రమానికి హాజరయ్యేందుకు పలు ప్రాంతాల నుంచి చీరాల రైల్వేస్టేషన్, బస్టాండ్‌లకు చేరుకున్న అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి.. ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన అంగన్వాడీ వర్కర్లను సిఐటియు నాయకులు పరామర్శించారు.

జిల్లా ఎమ్మెల్యేల మధ్య ఘర్షణ

(మొదటిపేజీ తరువాయి)

వద్దకు సుధాకర్‌బాబు వచ్చి దాడి చేశారన్నారు. ఎమ్మెల్యే సుధాకర్‌బాబు కూడా తనపై కొండపి ఎమ్మెల్యేతోపాటు ఇతర తెలుగుదేశం ఎమ్మెల్యేలు దాడి చేశారంటూ చేతికి ఉన్న స్వల్ప గాయాన్ని మీడియాకు చూపించారు. స్పీకర్ వద్ద గొడవ జరుగుతుంటే ఆయనకు రక్షణగా వెళ్లినట్లు తెలిపారు. ఇలా గొడవలో ఇద్దరూ కిందపడిపోయారు. ఏదేమైనా జిల్లా ఎమ్మెల్యేల మధ్య జరిగిన ఈ ఘర్షణ చర్చకు దారితీసింది.

నేడు జెవివి ఆధ్వర్యంలో సదస్సు

ఒంగోలు కలెక్టరేట్ : జనవిజ్ఞానవేదిక, ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం మూడు గంటలకు 'మళ్లీ కోవిడ్ అంట? హెచ్3ఎన్5 వైరస్- పరిణా మాలు' అనే అంశంపై ఆరోగ్య సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కొల్లా మధు ఓ ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని సాయి సరోజ్ మయూరి థియేటర్ పక్కనున్న ది కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ హాలులో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భారతి నర్సింగ్‌హోమ్ డాక్టర్, ఇఎన్‌టి స్పెషలిస్ట్ కొల్లా నాగేశ్వరరావు ముఖ్య వక్తగా మాట్లాడతారని పేర్కొన్నారు. ఆరోగ్య శ్రేయోభిలాషులు, మిత్రులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యా యులు ఈ సదస్సు పాల్గొని జయప్రదం చేయాలని కంచెర్ల వెంకటేశ్వర్లు, చిగురుపాటి చిన్నాజి,వెంకటేశ్వర్లు, అడుసుమల్లి రంగారావు కోరారు.

స్పందనకు 79 ఫిర్యాదులు

ఒంగోలు క్రైం : ఎస్‌పి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 79 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్‌పి మల్లికగర్గ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదులను సంబంధిత స్టేషన్లకు పంపి విచారణ జరిపించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

పోషకాహారంపై అవగాహన : జేసీ

ఒంగోలు కలెక్టరేట్ : పోషకాహారం లోపాన్ని తగ్గించేలా చిన్నారు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. స్థానిక స్పందన సమావేశ మందిరంలో 'పోషన్ పక్వాడా" ప్రత్యేక అవగాహనా కార్యక్రమానికి సబంధించిన కరపత్రాన్ని జేసీ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరేళ్లలోపు చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలలో రక్తహీనతను, పోషకాహార లోపాన్ని తగ్గించేలా ఆహారం విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిండమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ మని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ ఉషారాణి, సిడిపిఒలు, పాల్గొన్నారు.

చలో పార్లమెంట్ కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చేనెల 5న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, రైతు, కౌలు రైతు, సిఐటియు సంఘాలు పిలుపునిచ్చాయి. అందులో భాగంగా చలో పార్లమెంట్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని పని ప్రదేశంలో కూలీలు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తున్నట్లు తెలిపారు. 2021లో బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి లక్ష కోట్లు కేటాయించినట్లు తెలిపార. 2022లో రూ. 90 వేల కోట్లకు కుదించినట్లు తెలిపారు. 2023లో రూ. 60 వేల కోట్లకు కుదించినట్లు తెలిపారు. రూ.60 వేల కోట్లలో గతేడాదికి సంబంధించిన బకాలు రూ. 15 వేల కోట్లు పోనూ రూ. 45 వేల కోట్లు ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో కేటాయింపు చేసినట్లు తెలిపారు. పె. ప్రస్తుతం ఒక కుటుంబంలో 6 మంది ఉంటే ఒకే జాబ్ కార్డు ఇస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయం పూర్తిగా దెబ్బతినికూలీ పనులు లేకపోయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైమన్ కాశమ్మ, మస్తాన్, ఉపాధి మేట్లు, కూలీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బడుగు వెంకటేశ్వర్లు

ప్రతిభను వెలికితీసేందుకు

అసోసియేషన్ల ఆవిష్కరణలు అవసరం

ప్రజాశక్తి-మార్కాపురం

ఇంజినీరింగ్ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు డిపార్ట్‌మెంట్ల వారీగా అసోసియేషన్ల ఆవిష్కరణలు ఎంతో అవసరమని విహెచ్‌ఆరర్ విద్యా సంస్థల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఇందిరా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల సమక్షంలో డిపార్ట్‌మెంట్ల వారీగా అసోసియేషన్ల ఆవిష్కరణలు సోమవారం నిర్వహిం చారు. తొలుత అసోసియేషన్‌ల లోగోలను హనుమమారెడ్డి ఆవిష్కరి ంచారు. అఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషా ఈశ్వరన్, వివిధ విభాగాధిపతులు, డాక్టర్ కె.రాజశేఖర్‌రెడ్డి, కె. సురేంద్రరెడ్డి, షేక్ అబ్దుల్ కలాం, జె. సాయిబాబా, సి.పుష్పలత, ఆది నారాయణరెడ్డి, ఎన్ సత్యవాణి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెన్నా హనుమారెడ్డి

టిడిపి నాయకుల బైకు ర్యాలీ

మార్కాపురం : వైసిపి పాలనలో ప్రజలు విసిగిపోయారని, వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత ఏ విధంగా ఉందో ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడంతో పట్టణంలో విజయోత్సవ ర్యాలీ సోమవారం నిర్వహించారు. శ్రీఅల్లూరి పోలేరమ్మ దేవస్థానం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల్లో సాగింది. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, పట్టణ ప్రధాన కార్యదర్శి కొప్పులు శ్రీనివాసులు, టిడిపి నాయకులు కందుల రామిరెడ్డి, దూదేకుల మస్తానయ్య, గఫార్, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘ సభ్యులుగా కృపారావు

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ఐదో ఆర్థిక సంఘం సభ్యులుగా కాకి కృపారావు నియమితులయ్యారు. పదవిలో ఆయన మూడేళ్లపాటు సభ్యునిగా కొనసాగుతారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు. చేస్తూ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదేశాలు జారీ చేశారు. మద్దిపాడు మండలం పెదకొత్తపల్లి గ్రామానికి చెందిన కపారావు పోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో వివిధ హెూదాలలో పనిచేశారు. మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా విశిష్ట సేవలు అందించారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస్ రెడ్డి ఆయన్ని అభినందించి సోమవారం నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ కె.శీనారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ బి.బాబూ రావు, మెప్మా పీడీ టి.రవి కుమార్, డిపిఒ నారాయణ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్, పశు సంవర్ధక శాఖ మాజీ జేడీ రవీంద్రనాథ్ ఠాగూర్, చదలవాడ పశుక్షేత్రం డిడి ఎస్.రవి, విద్యుత్ శాఖ డిఇ వినయ్ కుమార్ రెడ్డిపాల్గొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న బాలినేని

శనగ పంట పరిశీలన

కొత్తపట్నం : మండల పరిధిలోని గాదె పాలెం గ్రామంలో రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో గుత్తి కొండ ఝాన్సీ లక్ష్మి అనే రైతు పూర్తి గా ప్రకతి వ్యవసాయం విధానంలో శనగ పంట సాగుచేసింది. ఈ పంటను జర్మనీకి చెందిన ఐజిఐ బృందం సోమవారం పరిశీలించింది. ప్రకతి వ్యవసాయానికి, రసాయనిక వ్యవసాయానికి మధ్య తేడాను పరిశీలించింది. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసులు, జిల్లా అగ్రికల్చర్ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీందర్ రెడ్డి , రీజినల్ కోఆర్డినేటర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE CHIT REGISTRAR AT ONGOLE
A.R.C . 25 OF 2021

Between:
M/s Kapil Chits (kosta) Pvt Ltd.
…..........Plaintiff

AND

Purimitla Sreenivasulu & Others
…....Defendants

OPP-1 .Purimitla Sreenivasulu, S/o.Venkaiah, Aged about: 53 Years, Occ:Farmar and Minaral water plant, R/o:Rudrakota(vill),Kavali(md),SPSR Nellore(dt).
OPP-2.Mukku Murali Mohan, S/o:Hussain,Aged about:53 years, Occ:Track MNTR-11,SCR,Kavali., R/o:D.no:25c,Vaddepalem,Kavali, Nellore(dt)..
OPP-3.Kaki Srinivasulu, S/o:Ramaiah, Aged about:42 years,Occ:SPL Gateman, SCR,Kavali, R/o:D.no:4-122 R/o:D.no:4-122,Chakicharla(vill), Prakasam(d.t)
OPP-4 Burla Audi Seha Reddy,S/o.Venkata Krishna Reddy, aged about:48Years, ,Occ:Hamal/GSH, Krishna Patnam Station,R/o:Mungamur (vill),Bogole(md),Nellore(dt).

NOTICE

Please take notice that the plaintiff instituted the above suit for recovery of a sum of Rs. 1,47,298/- with subsequent interest and costs and the matter stands posted to 11-04-2023 at 10.30 A.M for your appearance on that day you may appear personally before the Honourable Registrar,Ongole,at 10.30AM failing which the suit will be heard and determined in your absence exparty as per law.

(BY REGISTRAR ORDER)
M/S KAPIL CHITS KOSTA PVT LTD,
Rep. Zonal legal officer.

BEFORE THE HON'BLE CHIT REGISTRAR AT ONGOLE
A.R.C . 60 OF 2022

Between:
M/s Kapil Chits (kosta) Pvt Ltd.
…..........Plaintiff

AND

Shaik Rusum Jeelani Basha & Others
…....Defendants

OPP-1 .Shaik Rusum Jeelani Basha , S/o Khader Basha, Aged About: 39 Years , Occ:-Accountant in P A C S Veligandla, Prakasam Dt. R/o:- D.No:02-32, Ramalayam Street , Veligandla , Prakasam Dt.
OPP-2 Gorge Lakshmi Narayana , S/o Venkata Subaiah, aged about 40 Years, Occ:- Secondary Grade Teacher C/o M.P.P School, Panduva , Village, Veligandla Mandal, Prakasam Dt. R/o: 01-87 Main road, veligandla Mandal, Prakasam Dt.
OPP-3 Yarajala Lakshmi Nrayana ,S/o Venkata Subaiah, Aged About 39 years Occ:- Secondary Grade Teacher C/oJillellapadu Village, Peddaraveedu Mandal, Praksam Dt R/o: D.No:07-662 M-38 , Sivaji Nager, Markapuram Mandal, Prakasam Dt.
OPP-4 Shaik Nadigadda Khasim Peera S/o Mastan, Aged About 38 Years Occ: Sceondary Grade Teacher C/o M.P.P School, Veligundla Mandal, Praksam Dt, R/o: D.No.03/156, Main Road chinnaganjam Mandal, Prakasam Dt.

NOTICE

Please take notice that the plaintiff instituted the above suit for recovery of a sum of Rs.9,376/- with subsequent interest and costs and the matter stands posted to 11-04-2023 at 10.30 A.M for your appearance on that day you may appear personally before the Honourable Registrar,Ongole,at 10.30AM failing which the suit will be heard and determined in your absence exparty as per law.

(BY REGISTRAR ORDER)
M/S KAPIL CHITS KOSTA PVT LTD,
Rep. Zonal legal officer.

ఆర్.ఓ.సి.నెం : 94/13/ఎ1 — కనిగిరి పురపాలక సంఘం
తేది : 20-03-2023

వేలం ప్రకటన

కనిగిరి పురపాలక సంఘం పరిధిలో దినసరి కూరగాయల మార్కెట్ & చేపల మార్కెట్ మాంసం అంగళ్ళు 2023-24 సంవత్సరమునకు గుత్తలు వసూలు చేయుటకు కనిగిరి పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో వేలంపాట నిర్వహించబడును. సదరు వేలంపాటలో పాల్గొనదలచిన వారు ఈ క్రింది విధముగా ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనవలెను.

వ. నెం	వివరములు	కాలము	చెల్లించవలసిన ధరావత్తు	దాఖలు పరచవలసిన సాల్వెన్ సర్టిఫికేట్ విలువ	వేలము జరుగుతేది
1.	దినసరిమార్కెట్	01-04-2023 నుండి 31-03-2024	2,00,000/-	4,00,000/-	25-03-2023 సాయంత్రం గం.3.30 లకు
2	మాంసం మరియు చేపల మార్కెట్	01-04-2023 నుండి 31-03-2024	20,000/-	1,00,000/-	25-03-2023 సాయంత్రం గం.4.30లకు

సదరు వేలం పాటలు షరతులతో కూడిన వివరములు ఈ కార్యాలయ పనివేళల యందు సంబంధిత ఎ1 గుమస్తాను అడిగి తెలుసుకొనవచ్చును. సదరు వేలంపాటలు వాయిదా వేయుటకు లేక రద్దు పరుచుటకు కమీషనరు కనిగిరి పురపాలక సంఘం వారికి పూర్తి అధికారము కలదు.

కమీషనరు
కనిగిరి పురపాలక సంఘం

అంగన్‌వాడీల అక్రమ అరెస్టు

చలో విజయవాడను అడ్డుకున్న పోలీసులు ● కార్యకర్తలను పరామర్శించిన సీఐటీయూ నాయకులు

ప్రజాశక్తి-చీరాల

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న గొంతులను నొక్కేయాలని రాష్ట్ర వైసీపీ నియంత పోకడలతో ర్యాలీ, సభలను నిషేధిస్తూ జీవో నెంబర్ 1ని తీసుకువచ్చిందని, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని పలువురు నాయకులు అన్నారు. అంగన్‌వాడీ వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న అంగన్‌వాడీ వర్కర్లను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకురావటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని సిఐటియు నాయకులు ఎం వసంతరావు అన్నారు. సోమవారం చలో విజయవాడ కార్యక్రమానికి హాజరయ్యేందుకు పలు ప్రాంతాల నుంచి చీరాల రైల్వే స్టేషన్, బస్టాండ్‌లకు చేరుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు అక్రమ అరెస్టులు చేసి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన అంగన్‌వాడీ వర్కర్లను సిఐటియు నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అంగన్‌వాడీ వర్కర్లకు అనేక హామీలను ఇచ్చి అధికారాలు చేపట్టాక వాటిని మరిచిపోయి నియంత పాలనను కొనసాగిస్తుందని దుయ్యబట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ తెలంగాణ రాష్ట్రం కన్నా అదనంగా అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలు అమలు చేస్తానని హామీ ఇచ్చి ఇంత వరకు అమలు చేయలేదని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో అంగన్‌వాడీ వర్కర్లు క్రీస్తు రాజ్యం, కృష్ణవేణి, రమాదేవి, నాగమణి, సిహెచ్ శ్రీలక్ష్మి, వై రాధ తదితరులు ఉన్నారు.



పొదిలి మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

సిపిఎం నాయకులు బాబూరావు అరెస్ట్

జీవో నెంబర్ ఒకటిని రద్దు చేయాలని కోరుతూ చలో అసెంబ్లీ పిలుపులో భాగంగా కార్యక్రమానికి హాజరు కానివ్వకుండా సిపిఎం నాయకులు ఎన్ బాబురావు సిపిఐ నాయకులు ఎం వెంకట్రావు టిడిపి నాయకులు జనార్ధన్‌లను సోమవారం రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరటితో ఉద్యమాలను ఆపలేరని ప్రభుత్వం తక్షణమే తీసుకువచ్చిన జీవో నెంబర్ ఒకటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పొదిలి: మాట తప్పని మడమ తిప్పని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయమంటే అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి ఎం రమేష్ అన్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలను అరెస్టు చేసి నిర్బంధించడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పొదిలి మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రమేష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు అంగన్‌వాడీలకు నేటి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయమనడం, వాటి కోసం శాంతియుతంగా ధర్నాలకు పిలుపునివ్వడం నేరమా అని ప్రశ్నించారు. అరెస్టు చేసిన అంగన్‌వాడీలను అందరినీ బేషరతుగా వెంటనే విడుదల చేయాలన్నారు. 4 సంవత్సరాలు కావస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా మహిళలని కూడా చూడకుండా అర్ధరాత్రులు మార్గమధ్యంలో అరెస్టులు చేసి స్టేషన్‌కు తరలించి నిర్బంధించడం ప్రభుత్వ దమనకాండకు పరాకాష్ఠ అన్నారు. జిల్లాలో మద్దిపాడు, త్రిపురాంతకం, పొన్నలూరు, సింగరాయకొండ, కురిచేడులలో వందలాది మంది అంగన్‌వాడీలను అరెస్టు చేసి ఇప్పటికీ వదలి పెట్టలేదన్నారు. అంగన్‌వాడీల పట్ల దుర్మార్గంగా వ్యవహరించిన గత ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసిపోయాయన్నారు. ఈ ప్రభుత్వానికి అలాంటి గతి పట్టకముందే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ ధర్నాలో సిఐటియు పొదిలి మండలం కార్యదర్శి బండి కోటేశ్వరరావు, నాయకులు ఎం శోభారాణి, జ్యోతి, నాగమణి, ప్రజావతి, కృపారావు, నాగలక్ష్మి, ఇందిర, కెవి నరసింహం, డి సుబ్బయ్య, జి నాగులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హెల్త్ అలవెన్స్ అమలు చేయాలి: సిఐటియు

ప్రజాశక్తి-పొదిలి: పొదిలి నగర పంచాయతీ కార్మికులకు హెల్త్ అలవెన్సులు వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ అన్నారు. సోమవారం పొదిలి నగర పంచాయితీ ఆఫీసు వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రమేష్ మాట్లాడుతూ పొదిలి నగర పంచాయతీగా మారి 2సంవత్సరాల 3 నెలలు కావస్తున్నా నేటికీ హెల్త్ అలవెన్స అమలు కావటం లేదన్నారు. ఫలితంగా ప్రతి కార్మికుడు నెలకు రూ.6 వేల లెక్కన లక్షా 62వేల రూపాయలు నష్టపోతున్నా ప్రభుత్వం, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారన్నారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోకుంటే విధులు బహిష్కరించాల్సి వస్తుందన్నారు. ఈ ధర్నాలో నగర పంచాయితీ వర్కర్స్ యూనియన్ నాయకులు జి నాగులు, డి సుబ్బయ్య, కెవి నరసింహం, బి కోటేశ్వరరావు, రాజయ్య పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు ర్యాలీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రకాశం జిల్లా విద్యా శాఖాధికారి ఉత్తర్వుల మేరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో సోమవారం నుంచి ప్రభుత్వం వారు ఆదేశించిన విధంగా ఉదయం ప్రార్థనా సమయంలో బాల్య వివాహాలను నివారించేందుకు విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు బి హరిరామ్ మాట్లాడుతూ ఆడపిల్లలకు చదువు చాలా ముఖ్యమని, ఉన్నత చదువులు, ఉద్యోగాలు సాధించి స్వతంత్రంగా జీవించే వరకు పెళ్లికి ఆగాలని అన్నారు. త్వరపడి అమ్మాయిలు 18 సంవత్సరాల లోపు, అబ్బాయిలు 21 సంవత్సరాల లోపు పెళ్లి చేసుకోవడం చట్టరీత్యా నేరమని తెలిపారు. సాయంత్రం పాఠశాల ఉన్నత తరగతి బాలికలతో గ్రామంలో ప్లకార్డులు చేతబట్టి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు బి హరిరామ్, బివి సుబ్బారావు, ఏవి పద్మావతి, పి విజయలక్ష్మి, ఎన్ కల్యాణి, వ్యాయామ ఉపాధ్యాయులు కె మాల్యాద్రి, సయ్యద్ జంషీర్ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు ఆదాయం రూ.16,88,642

ప్రజాశక్తి-జరుగుమల్లి


మండలంలోని కామేపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానం హుండీ లెక్కింపు సోమవారం జరిగింది. ఈ హుండీ లెక్కింపులో ఐదు నెలల 20 రోజులకు గాను రూ.16,88,642 ఆదాయం వచ్చింది. దేవాలయ ప్రాంగణంలో దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో లెకిక్కంపు జరిగింది. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాలయ కార్య నిర్వహణాధికారి ఆర్ శివశంకర్, దేవదాయ ధర్మాదాయ శాఖ కందుకూరు ఇన్‌స్పెక్టర్ జిఎ సత్యనారాయణ, దేవాలయ పూజారులు, దేవాలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


హుండీ లెక్కిస్తున్న దేవదాయ సిబ్బంది

వైవి సుబ్బారెడ్డిని కలిసిన యర్రం వెంకటరెడ్డి

ప్రజాశక్తి-పొదిలి

తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవి సుబ్బారెడ్డిని సోమవారం తాడేపల్లి ఆయన నివాసంలో రెడ్డి జేసి డాక్టర్స్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యర్రం వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు.



సిపిఎస్ రద్దు చేయాలి

ప్రజాశక్తి-చీరాల

బాధ్యత గల హోదాలో ఉన్న మంత్రి బొత్స సత్యనారాయణ ఉద్యోగుల జీతభత్యాల పట్ల అవమానకరంగా మాట్లాడటం శోచనీయమని, ఏపి రెవెన్యూ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సిహెచ్ సురేష్‌బాబు అన్నారు. ఉద్యోగస్తులకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వడం అనేది ప్రభుత్వ భాధ్యత అని, ఒకటవ తారీకు జీతం పొందడం తమ హక్కు అని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమ కార్యచరణలో భాగంగా తాలూకా కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపి రెవెన్యూ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సిహెచ్ సురేష్ బాబు, హాజరై మాట్లాడారు. ఉద్యోగుల పెండింగ్ డిఎ, పిఆర్‌సి మరియు ఇతర పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సంఘం మండల అధ్యక్షులు సిహెచ్ శేఖర్, ఇన్‌ఛార్జి ఆర్ఐ శివశంకర్, సర్వేయరు సజ్జా లోకేష్, కళ్యాణ్, డి.సాల్మన్, జ్యోతి, రిజ్వానా, మధులత, జయబాబు, సదానందం, ఇతర కార్యవర్గ సభ్యులు, వివిధ డిపార్ట్‌మెంట్లకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

కేన్సర్ నివారణకు కృషి చేయాలి: ఆర్ఎంవో

ప్రజాశక్తి-చీరాల

కేన్సర్ నియంత్రణకు అన్ని ప్రాంతాల్లోని ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని చీరాల ఏరియా హాస్పిటల్ అర్ఎంవో డాక్టర్ సుభాషిణి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఏరియా వైద్యశాలలోనీ సమావేశం హాలులో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దంత వైద్యులు సునయన మాట్లాడుతూ నేటి యువతరం అధిక శాతం మంది వివిధ హానికర మత్తు పదార్థాలతో ప్రాణాంతక బారిన పడుతున్నట్లు వివరించారు. ప్రారంభ దశలో వాటిని గుర్తించినట్లయితే ప్రాణాలు రక్షించవచ్చని అన్నారు.ఈక్రమంలో వచ్చే లక్షణాలను సుదీర్ఘంగా వివరించారు. గ్రామాల్లో విధులు నిర్వహించే ఆరోగ్య సిబ్బంది ఈవిధమైన లక్షణాలు ఉన్నవారిని గుర్తించి స్థానికంగా ఉన్న ప్రభుత్వ వైద్యశాలల ద్వారా వైద్యం సాయం అందించేందుకు కషిచేయాలన్నారు.కార్యక్రమంలో డాక్టర్ రవిప్రకాష్, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ సంధ్య, డాక్టర్ సత్య, జాతీయ టుబాకో ప్రోగ్రామ్ మెంబర్ రమేష్, అన్ని ప్రాంతాల్లోని ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎంఓ డాక్టర్ సుభాషిని

ఎద్దు దాడిలో కార్మికుడికి గాయాలు

ప్రజాశక్తి-కనిగిరి

ఎద్దు దాడిలో మున్సిపల్ పారిశుధ్య కార్మికుడికి గాయాలైన సంఘటన సోమవారం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని పామూరు రోడ్డు కూచిపూడిపల్లి సమీపంలో చోటు చేసుకుంది. పిచ్చిఎక్కిన ఎద్దు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండటంతో దానిని కట్టడి చేసేందుకు కోవిడ్ స్కీం మున్సిపల్ కార్మికులు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు వెళ్లారు. ఈ క్రమంలో కోవిడ్ స్కీం వర్కర్ ప్రసాద్‌పై ఎద్దు దాడి చేయటంతో కాలు విరిగింది. క్షతగాత్రుడిని తొలుత ప్రభుత్వ వైద్యశాలకు, తరువాత ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. కుక్కలు, ఆవులు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగేలా, ప్రజలపై దాడులకు పాల్పడతుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు చొరవచూపి అవులు, కుక్కల వలన ఇబ్బందులు లేకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బెల్లం ఊట ధ్వంసం.. నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ఎస్ఈబి కార్యాలయ పరిధిలో మార్కాపురం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో త్రిపురాంతకం మండలం డివిఎన్ కాలనీ బలుసుల వాగు దగ్గర నాటుసారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉన్న 300 లీటర్ల బెల్లం ఊటను కనుగొని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. నాటుసారా బట్టీలను పగులగొట్టారు. డివిఎన్ కాలనీకి చెందిన మాట నాగశ్రీను అనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో యర్రగొండపాలెం ఎస్ఈబి ఎస్ఐ రహమాన్, డిటిఎఫ్ మార్కాపురం కానిస్టేబుల్స్ బాల రంగయ్య, చంద్రశేఖర్, ఎస్ఈబి సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై దాడికి వైసిపి ఖండన

ప్రజాశక్తి-చీమకుర్తి

అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకరబాబుపై టిడిపి నాయకులు దాడి చేయడాన్ని వైసిపి నాయకులు ఖండిస్తూ స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. సోమవారం అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీలో స్పీకర్‌పై దాడి చేసిన తెలుగుదేశం ఎమ్మెల్యేలు దాడి చేయడాన్ని, అడ్డుకోబోయిన ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకరబాబుపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ ఛైర్మన్ చల్లా అంకులు, మండల వైసిపి కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు కె శేఖరరెడ్డి పాల్గొన్నారు.


అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

స్పందనలో రెడ్ క్రాస్ సొసైటీ సేవలు

ప్రజాశక్తి-బాపట్ల

జిల్లా నలుమూలల నుంచి స్పందనకు విచ్చేసే అర్జీదారులకు సోమవారం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ పర్యవేక్షణలో సహారా ఇండియా బాపట్ల శాఖ సహకారంతో అల్పాహారం మంచినీరు అందజేశారు. నడవలేని వారికి వీల్ ఛైర్స్ ద్వారా అర్జీలు అందించటానికి రెడ్ క్రాస్ యువత సేవలందించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ బిఎస్ నారాయణ భట్టు, శ్రీ రామచంద్రమూర్తి, జి సున్నీ, ఎఎస్ భార్గవ్, మణికంఠ, గోపీనాథ్, సహారా ఇండియా ప్రతినిధి చామర్తి ఆంజనేయులు పాల్గొన్నారు.



మల్లు స్వరాజ్యంకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

మల్లు స్వరాజ్యంకు నివాళి

ప్రజాశక్తి-మేదరమెట్ల

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరవనిత కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతిని సోమవారం మండలంలోని ప్రాసంగలపాడు గ్రామంలో సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు చావా కోటేశ్వరరావు, కంచర్ల సుధాకర్‌రావు, కంచర్ల హరిబాబు, ఎన్ రాజారావు, కంచర్ల శ్రీనివాసరావు, నక్కల పెద్ద అంజయ్య, కెవిపిఎస్ మండల బాధ్యులు కంచర్ల సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



విఆర్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుధారాణి

బకాయిలు త్వరగా చెల్లించాలి

ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం

మండలంలోని తాసీల బకాయిలు త్వరగా చెల్లించే విధంగా కృషి చేయాలని తహశీల్దారు సుధారాణి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆమె విఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో తాసీలు సుమారు రూ.33.47 లక్షల బకాయిలు ఉన్నట్లు తెలిపారు. మార్చి నెలాఖరుకు మొత్తం బకాయిలు వసూలు చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు చరణ్, విఆర్ఒలు పాల్గొన్నారు.



దెబ్బతిన్న మొక్కజొన్న పైరు

అకాల వర్షానికి నేలకొరిగిన మొక్కజొన్న

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్: ద్రోణి ప్రభావంతో గత మూడు రోజుల నుంచి ఈదురు గాలులతో కురుస్తున్న అకాల వర్షానికి రైతన్న కుదేలవుతున్నాడు. ఆరు కలలు కష్టపడి పండించిన పంట చేతికందే టైంలో ప్రకృతి కోపానికి పంట నేల పాలవుతుంది అని రైతులు ఆవేద వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో నక్కబొక్కలపాడు, కొనిదెన, కొప్పరపాలెం, మల్లయ్య పాలెం, బల్లికురవ, గుంటుపల్లి, అంబడిపూడి, చెన్నుపల్లి, కొమ్మినేనివారిపాలెం తదితర గ్రామాలలో మొక్కజొన్న పైరు అధికంగా సాగు చేశారన్నారు. మొక్కజొన్న పైరు కొంత కోత దశకు చేరుకోగా మరికొంత గింజ దశలో ఉందన్నారు. ఆదివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానతో పాటు వీచిన గాలులకు పలుచోట్ల మొక్కజొన్న పైరు పూర్తిగా నేలకు ఒరిగిందని పేర్కొన్నారు. ఏటా ప్రకృతి కోపానికి అన్నదాతకు కన్నీరే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎకరాకు 25 వేల నుంచి 30 వేల వరకు పెట్టుబడులు పెట్టామని, ప్రభుత్వం స్పందించి పంటలు పరిశీలించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మండల రైతాంగం కోరుతున్నారు.

హద్దులు దాటిన వైసీపీ రౌడీయిజం

సాక్షాత్తూ అసెంబ్లీలోనే దళిత ఎమ్మెల్యేపై దాడి ● అసెంబ్లీ చరిత్రలోనే చీకటి రోజు ● అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

వైసీపీ ఫ్యాక్షన్ మూకలు అసెంబ్లీలో పాల్పడిన దుశ్చర్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలోనే బ్లాక్ డేగా మిగిలిపోతుందని శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. శాసనసభలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుంటే మా పార్టీ దళిత ప్రజాప్రతినిధిపైనే వైసీపీ ఎమ్మెల్యేలు దాడి చేశారు. దళిత ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిపై దాడికి పాల్పడటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రజా సమస్యలపై పోరాడుతున్న శాసనసభ్యుడిని ఒక పథకం ప్రకారం దళిత వైసిపి శాసనసభ్యుడితోనే దాడి చేయించడం జగన్‌రెడ్డి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. ముందు వరుసలో మంత్రులు, వైసిపి శాసనసభ్యులు ఉన్నా వెనుకనున్న వారు వచ్చి దళిత శాసన సభ్యుడైన స్వామిపై దాడి చేయించారని, ఇదంతా ఒక పథకం ప్రకారం జగన్‌రెడ్డి చేయించిన దాడిగానే పరిగణిస్తున్నామని తెలిపారు. శాసనసభలోనే ఎస్సీ ఎమ్మెల్యేలకు రక్షణ లేదంటే రాష్ట్రంలో ఐదు కోట్ల ప్రజలకు రక్షణ ఉందా అని ప్రశ్నించారు. ఇది సైకో పాలన కాక మరేమిటని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి పోయేకాలం వచ్చిందని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజలు తరిమి కొట్టడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. శాసనసభలో జరిగిందంతా సభాపతికి తెలుసని అసెంబ్లీలో ఉన్న కెమేరాల ఇన్‌పుట్‌ను ఎటువంటి కత్తిరింపులు లేకుండా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దౌర్జన్యానికి పాల్పడిన ప్రజాప్రతినిధులు ఎవరన్నది ప్రజానీకానికి తెలుస్తుందని, మేము తప్పు చేసివుంటే ఎలాంటి చర్యలు తీసుకున్నా సిద్ధమని ఎమ్మెల్యే గొట్టిపాటి అన్నారు.

బల్లికురవ రూరల్: తెలుగుదేశం పార్టీ దళిత ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయ స్వామి, సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిలపై అధికార వైసీపీ ఎమ్మెల్యేలు గూండాలు మాదిరిగా దాడి చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకే కళంకమని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి అర్వపల్లి ఆంజనేయులు పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇది చీకటి రోజు అని అభివర్ణించారు. ప్రజాస్వామ్య దేవాలయం లాంటి శాసనసభలోనే జరిగిన ఈ దాడి అమానుషమని ఆయన పేర్కొన్నారు. మూడు ప్రాంతాల్లో పట్టభద్రులు వైసీపీని ఛీ కొడుతూ టిడిపి అభ్యర్థుల్ని గెలిపించడం ఓర్చుకోలేని వైసీపీ ఎమ్మెల్యేలు తమ ఫ్యాక్షన్ మెంటాలిటీని అసెంబ్లీలోనే చూపించారని పేర్కొన్నారు. మంత్రి అంబటి రాంబాబు వీధి రౌడీ కంటే ఘోరంగా ప్రవర్తించి రాజకీయాలకి కళంకం తెచ్చారని అన్నారు. టిడిపి ఎమ్మెల్యేలపై దాడి చేసిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, దాడికి పాల్పడ్డ వైసిపి ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి శాశ్వతంగా సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

చీరాల: తెలుగుదేశం పార్టీ కొండేపి ఎమ్మెల్యే డోల బాల వీరాంజనేయ స్వామిపై వైసీపీ ఎమ్మెల్యే సుధాకర్ శాసనసభ సాక్షిగా దాడి చేయటాన్ని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండించింది. సోమవారం చీరాల ముక్కోణం పార్క్ సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య సూచన మేరకు శాసనసభలో కొండపి తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు డోలా బాల వీరాంజనేయస్వామిపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంఎల్ఏ సుధాకర్ దాడి చేయడాన్ని ఖండిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ జీఓ నెంబర్ 1పై అసెంబ్లీలో చర్చ



శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్

జరుగుతున్న సమయంలో అధికారపార్టీ ఎంఎల్ఏలు డోలా బాల వీరాంజనేయస్వామిని దూషిస్తూ దాడికి పాల్పడటం శోచనీయమైన విషయం. ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, మైనారిటీ అధ్యక్షులు మోహిద్దీన్, శ్రీనివాస తేజ, కౌతావరపు జనార్దన్, కె సుబ్బలక్ష్మి, శాంతమ్మ, ఆంటోనీ, లాలా అహ్మద్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: అసెంబ్లీలో దళిత శాసనసభ్యుడు డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి మరియు బుచ్చయ్య చౌదరిలపై దాడిని ఖండిస్తూ హనుమంతునిపాడు తెలుగుదేశం పార్టీ ఆఫీసు నుంచి ర్యాలీ నిర్వహించారు. దుహంకార పాలన నశించాలని, సైకో పోవాలి, సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేస్తూ అంబేద్కర్ బొమ్మ వరకు ర్యాలీగా వెళ్లి రాజ్యాంగానికి కాపాడమని కోరుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి వినతిపత్రం సమర్పించారు. మురహరి నరసయ్య ఆధ్వర్యంలో, తాతిరెడ్డి పిచ్చిరెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం నాయకులు గాయం రామిరెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, శ్యామల వెంకటేశ్వర్లు, కోటపాటి శేషయ్య, చీకటి వెంకటసుబ్బయ్య, మాసపోవు ఎర్రయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీల ఓటమిని ఓర్చుకోలేక..
వైసిపి ఎమ్మెల్యేలకు పిచ్చి పట్టింది: వేగేశన

ప్రజాశక్తి-బాపట్ల

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో టీడీపీ విజయం ఓర్వలేక వైసిపి ఎమ్మెల్యేలు శాసనసభలో పిచ్చిగా ప్రవర్తిస్తున్నారని బాపట్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ బాధ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. సోమవారం బాపట్ల పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నరేంద్రవర్మ మాట్లాడుతూ శాసనసభలో వైసీపీ ఎమ్మెల్యే లు రౌడీ ముఖల్లా టీడీపీ ఎమ్మెల్యే డోల బాలవీరంజనేయ స్వామిపై దాడి చేయడం దారుణమన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అసెంబ్లీ చరిత్రలోనే ఇలాంటి సంఘటన మునుపెన్నడూ చోటు చేసుకోలేదన్నారు. రాష్ట్ర శాసనసభ చరిత్రలో ఇది చీకటి రోజుగా మిగిలిపోతుందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రోద్భలంతోనే ఎమ్మెల్యేలు రెచ్చిపోతున్నారు. ఒక వ్యూహంతోనే దళిత టీడీపీ ఎమ్మెల్యే మీద దాడికి తెగబడుతున్నారు. రాష్ట్రంలో ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు, వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారనన్నారు. సమావేశంలో గొలపల శ్రీనివాసరావు, ముక్కామల శివ, తోట నారాయణ, పమిడి భాస్కరరావు, దయా బాబు, మానం విజేత, అల్లం సరోజిని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే స్వామిపై దాడి ప్రజాస్వామ్యానికే మచ్చ

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామిపై అసెంబ్లీ సాక్షిగా జరిగిన దాడి ఘటన ప్రజాస్వామ్యానికి అవమానకరమని, చరిత్రలో ఇది చీకటి రోజని టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్రంగా విమర్శించారు. సోమవారం అయన మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు దేశం పార్టీకి చెందిన డోలా బాల వీరాంజనేయస్వామిపై అసెంబ్లీలో వైసీపీ ఎమ్మెల్యేలు రౌడీ మూకల్లా వచ్చి భౌతికదాడి చేయడం అమానుషం అన్నారు. జీవో నంబర్ 1పై వాయిదా తీర్మానం ఇచ్చి చర్చ చేపట్టాలని స్పీకర్‌ను కోరేందుకు వెళ్లామని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. జీవో నెంబర్ 1ని రద్దు చేయాలని కోరామని అదే సమయంలో వైసీపీ ఎమ్మెల్యేలంతా మూకుమ్మడిగా వచ్చి అక్కడ ఉన్న కొండపి ఎమ్మెల్యే స్వామిపై సంతనూతలపాడు, చింతలపూడి ఎమ్మెల్యేలు సుధాకర్, ఎలీజా దాడి చేయడం అమానుషమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి ఓటమిని జీర్ణించుకోలేక పక్కా ప్లాను ప్రకారం, యుద్ధ వాతావరణం తలపించేలా అసెంబ్లీలో ఎమ్మెల్యే స్వామిపై దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు మానసికంగా కంట్రోల్లో లేకుండా ఇలా దారుణంగా ప్రవర్తించడం సిగ్గుచేటని ఏలూరి ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా ఉన్న జీవో నెంబర్ 1 రద్దు చర్చకు పట్టుపడితే అసెంబ్లీ సాక్షిగా చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వైసిపి ఎమ్మెల్యేలు దారుణంగా ప్రవర్తించారని అన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. శాసనసభ్యునిపై కొందరు పశువుల్లాగా ప్రవర్తించారని, దళిత శాసనసభ్యుడు ప్రజా సమస్యలపై గళం వినిపిస్తున్న సమయంలో ఆయనపై దళిత శాసన సభ్యులను ఉసిగొల్పి దాడి చేయించడం, అసెంబ్లీకే కళంకమని పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తులకు ఖచ్చితంగా బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమయిందని, ప్రజాక్షేత్రంలో వారికి త్వరలో గుణపాఠం తప్పదని ఏలూరి హెచ్చరించారు.



మాట్లాడుతున్న పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చిత్రంలో కింజరాపు అచ్చెన్నాయుడు

ఉగాది నుంచి 'మీ మాటే నా బాట': నరేంద్రవర్మ

ప్రజాశక్తి-బాపట్ల

తెలుగు నూతన సంవత్సరం ఉగాది నుంచి తెలుగుదేశం పార్టీ బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు బాపట్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ బాధ్యులు నరేంద్రవర్మ ఆధ్వర్యంలో మీ బాట నా మాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు నరేంద్రవర్మ ప్రకటించారు. అందులో భాగంగా సోమవారం పార్టీ కార్యాలయంలో మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. బాపట్ల నియోజకవర్గంలో 95 వేల కుటుంబాలను ఆత్మీయంగా పలకరించి సమస్యలు, కష్టసుఖాలు తెలుసుకునేందుకు మీలో ఒకడిగా, మీ సేవకు కదిలి వస్తున్నా అనే నినాదంతో నరేంద్రవర్మ ముందుకెళుతున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో పర్యటన కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో మహిళలకు పార్టీ తరపున చీరలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మానం విజేత, పల్లం సరోజిని, జిట్టా ప్రమీలారాణి, పార్టీ నాయకులు మహిళలు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయంలో చీరలు పంపిణీ చేస్తున్న నరేంద్రవర్మ

స్పందన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : జేసీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక దష్టి పెట్టి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ స్పష్టం చేశారు..కలెక్టరేట్‌లోని స్పందన హాలులో డయల్ యువర్ కలెక్టర్' 'స్పందన' కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి జేసీ ఫిర్యాదులు, విజ్ఞప్తులను స్వీకరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ స్పందన అర్జీలను నిర్ధిష్ట గడువులోపు సహేతుకంగా పరిష్కరించాలన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలన్నారు. స్పందన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ బి. చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సరళా వందనం, ఉమాదేవి, చెన్నయ్య, జగధీశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డయల్ యువర్ కలెక్టర్‌కు విశేష స్పందన

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో భాగంగా ప్రజలు ఫోన్‌లో ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా, మండల స్థాయి అధికారులను జేసీ ఆదేశించారు. వీటి పై అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో సంయుక్త కలెక్టర్ మాట్లాడారు.



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ అభిషిక్త్ కిషోర్

– త్రిపురాంతకం మండలం రామసముద్రం గ్రామం నుంచి నరసారెడ్డి ఫోన్ చేసి తమ గ్రామంలో తాగునీటి సమస్య ఉందని, సాగుర్ కూడా నీళ్ల కావాలని కోరారు. జేసీ స్పందిస్తూ తాగు, సాగు నీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– కొమరోలు మండలం దొడ్డవాడ నుంచి రఘురామ రెడ్డి ఫోన్ చేసి కొండ ప్రాంతంలో భూమి ఇచ్చారని, ల్యాండ్ కన్వర్షన్ కోసం సబ్ కలెక్టర్‌ను కలిశామని. త్వరగా న్యాయం జరిగేలా చూడాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని జేసీ తెలిపారు.

– కొమరోలు మండలం రెడ్డిచెర్ల గ్రామం నుంచి పుల్లయ్య ఫోన్ చేసి సర్వే నెం. 1833-3లోని 1.99 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ స్థలాన్ని వెబ్ ల్యాండ్‌లో లీలావతి పేరుతో ఎక్కించారని, తమకు న్యాయం చేయాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని జేసీ తెలిపారు.

– త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి గ్రామం నుంచి శామ్యూల్ ఫోన్ చేసి పంటల బీమాలో తమకు నష్ట పరిహారం ఇప్పించేలా చూడాలని కోరారు. నిబంధనల మేరకు పరిహారం దక్కేలా చూస్తామని జేసీ హామీ ఇచ్చారు.

బకాయి వేతనాలు చెల్లించాలని కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- కురిచేడు

పంచాయతీ కార్మికులకు ఎడాదిగా, స్వచ్ఛభారత్ కార్మికులకు 2 సంవత్సరాల నుంచి జీతాలు అందడం లేదని, బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా తెలిపారు. కార్మికుల ధర్నాకు సిఐటియు దర్శి నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కంభంపాటి కోటయ్య అనే వ్యక్తి ఉద్యోగ విరమణ చేసి 6 సంవత్సరాలు అయినప్పటికీ ఆయనకు రావాల్సి నిధులు ఇవ్వలేదని తెలిపారు. నిధులు గోల్‌మాల్ చేసి ఆయనకు పింఛనుకూడా రాకుండా చేశారని తెలిపారు. కోటయ్యకు పింఛను వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్మికుల ధర్నా గురించి తెలుసుకున్న డిఎల్‌పిఒ శోభన్‌బాబు ఘటనా స్థలానికి వచ్చి యూనియన్ బాధ్యులతో చర్చలు జరిపారు. పంచాయతీ కార్మికులకు 3 నెలల జీతం నెలాఖరుకు



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ఇచ్చే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు కోటయ్యకు సంబంధించిన నిధుల విషయంపై విచారణ జరుపుతున్నామని స్వాహా అయిన నిధులను రికవరీ చేసి రెండు నెలల్లో ఫించన్ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చిన వెంటనే స్వచ్ఛభారత్ కార్మికులకు వారి జీతాలు వచ్చే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కంభంపాటి కోటమ్మ, కమ్మిలి అశోక్ కుమార్, జార్జి, కంభంపాటి సాల్మన్ పాల్గొన్నారు.

ఉగాది వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు

జేసీ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉగాది వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ అధి .కారులను ఆదేశించారు. జేసీ ఛాంబర్‌లో ఉగాది పండుగ ఏర్పాట్లపై సోమవారం అధిక ారులతో సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఒంగోలు నగరంలోని పోలీసు కళ్యాణ మండపంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ వేడుకలను నిర్వహించన ్నట్లు తెలిపారు. పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం, అష్టావధానం వంటి కార్యక్ర మాలను ఈ వేడుకలలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ బి.చిన ఓబులేసు, ఆర్‌డిఒ విశ్వేశ్వర రావు, దేవాదాయ సహాయ సంచాలకులు మాధవి, డిఇఒ పి.రమేష్, మెప్మా పీడీ రవికుమార్, జిల్లా పర్యాటక శాఖ అధికారి బెన్హర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్, ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్ వీరాంజనేయులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అక్రమ అరెస్టు దారుణం

పలు చోట్ల నిరసనలు

ప్రజాశక్తి - కురిచేడు

తమ కోర్కెల సాధన కోసం చలో విజయవాడకు 36 మంది అంగన్‌వాడీలు మూడు వాహనాలలో దర్శి నుంచి కురిచేడు మీదుగా విజయవాడకు బయలుదేరారు. వెంగాయపాలెం చెక్‌పోస్టు వద్ద కురిచేడు ఎస్ఐ ఎన్.దేవకుమార్ తన సిబ్బందితో మూడు వాహనాలలో వెళ్తున్న అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకున్నాడు. అనుమతులు లేకుండా ధర్నా వెళ్లడం నేరమని చెప్పి వారిని పోలీసు స్టేషన్‌కి తరలించి సాయంత్రం 5 గంటల వరకూ అక్కడే ఉంచారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని వదిలి పెట్టారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బి. అచ్చమాంబ, బాలమ్మ, ఎ. తిరుపతమ్మ. పి. మీరా కుమారి పి. మాణిక్యం తదితరులు ఉన్నారు. **పామూరు :** అక్రమ అరెస్టులు కార్మికులకు కొత్తేమి కాదని సిఐటియు మండల కార్యదర్శి కె. మాల్యాద్రి తెలిపారు. అంగన్‌వాడీలు, నాయకుల అక్రమ అరెస్టులను వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేశారు. ఈ సంధర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. చలో విజయవాడకు అంగన్‌వాడీ కార్యకర్తలు వెళ్లుతుంటే అడ్డుకోవడం, ముందస్తు నోటీసులు పోలీసులు అందజేయడం రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు రాజ్యలక్ష్మి, సుబ్బమ్మ, నారాయణమ్మ, ఐద్వా నాయకులు భానుమతి, మదారమ్మ,



మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో ఉన్న పొన్నలూరు మండల అంగన్‌వాడీలు

అంజలి, ఖాదరున్నీసా, అల్లాబక్షు, మహదేవయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **శింగరాయకొండ :** అంగన్‌వాడీలు చలో విజయవాడకు వెళ్లకుండా పోలీసులు తెల్లవారుజామునుంచే తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్, ఆర్‌టిసి బస్టాండ్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ ఫిరోజా ఫాతిమా ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. **చీమకుర్తి :** చలో విజయవాడ సందర్భంగా అంగన్ వాడీల అక్రమ అరెస్టులను ఖండిస్తూ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ ఎన్నికల ముందు తెలంగాణా ప్రభుత్వం కంటే రూ.1000 అదనంగా అంగన్‌వాడీలకు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహాశీల్దారు పిన్నిక మధుసూధనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శారద, నాగరత్నం, సుబ్బమ్మ,సుజాత, రమాదేవి, రమణమ్మ, సీతమ్మ, భారతి, దుర్గ పాల్గొన్నారు. **కొండపి :** అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన చలో విజయవా కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు నాయకులను అరెస్టు చేశారు. సిఐ మాతంగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిపిఎం మండల నాయకుడు కెజి. మస్తాన్‌ను అరెస్టు చేశాడు. **త్రిపురాంతకం :** అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనేందుకు యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాలకు చెందిన అంగన్‌వాడీలు బయలు దేరారు. మేడపి టోల్‌ప్లాజా వద్ద వారిని అరెస్టు చేశారు. అనంతరం త్రిపురాంతకం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత సొంత పూచికత్తుపై వారిని విడుదల చేశారు. **మద్దిపాడు :** చలో విజయవా కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న పొన్నలూరు మండలానికి చెందిన అంగన్‌వాడీలను గుండ్లపల్లి గ్రోత్ సెంటర్ వద్ద మద్దిపాడు పోలీసులు అదుపులోకి తీసుకోవడం అ ప్రజాస్వామ్యమని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ మహిళలని కూడా చూడకుండా పోలీస్ స్టేషన్‌లోనే ఉంచడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. పోలీసు స్టేషన్‌లో ఉన్న అంగన్‌వాడీలకు సిఐటియు మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి, సిఐటియు జిల్లా నాయకులు బి. శ్రీను,సిఐటియు జిల్లా కార్యదర్శి వినోద్ పరామర్శించారు.

24న అంబేద్కర్ విగ్రహావిష్కరణ

చీమకుర్తి : మాజీ ఎమ్మెల్యే వేమాయల్లయ్య వర్ధంతి సందర్భంగా వేమా యల్లయ్యనగర్ భవన ఆవరణలో జడ్‌పిటిసి వేమాశ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఈనెల 24న ఆవిష్కరించనున్నటు వైసిపి నాయకులు తెలిపారు. స్థానిక బూచేపల్లి కార్యాలయంలో వైసిపి కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 24న ఉదయం 10 గంటలకు విగ్రహావిష్కరణ ఉంటుం దన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే సుధాకరబాబు, మాజీఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొనున్నటు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు కె. శేఖరరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ చల్లా అంకులు, కౌన్సిలర్లు గంగయ్య,మాణిక్యం పాల్గొన్నారు.



స్వరాజ్యం చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తు్న నాయకులు

మల్లు స్వరాజ్యంకు ఘన నివాళి

పామూరు : కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి స్థానిక సుందరయ్య భవనంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు స్వరాజ్యం చితత్ర చిత్రపటానికి ఐద్వా నాయకురాలు షేక్ మదార్‌బి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఐద్వా అధ్యక్షురాలు భానుమతి మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం చిన్నతనం నుంచి పోరాటాలలో ఉద్యమాలు చురుకుగా పాల్గొని మహిళలకు రక్షణగా నిలబడినట్లు తెలిపారు. ఆమె స్ఫూర్పి తో అందరకూ ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి షేక్ ఖాదర్ నిషా, షేక్ మస్తానమ్మ, అంజలి, వరమ్మ, ప్రభావతి, కొండమ్మ, రమణమ్మ పాల్గొన్నారు



వరి ఓదెలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పంటలు పరిశీలన

ప్రజాశక్తి- శింగరాయకొండ

శింగరాయకొండ మండలం కలివాయ గ్రామంలో రైతులు సాగుచేసిన వరి, శనగ, దనియాలు, సోయా చిక్కుడు, మిర్చి పంటలను ఆత్మపీడీ, జిల్లా వనరుల కేంద్రం సమన్వకర్త కె. అన్నపూర్ణ, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ వరి ఓదెల మీద గింజలు మొలకలు రాకూండా ఉండేందుకు 5 గ్రాముల ఉప్పును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. నూర్చిన ధాన్యం తడిసే క్వింటా ధాన్యానికి కిలో ఉప్పు, నాలుగు కిలోల వరిఊక కలిపి ఆరబెట్టాలన్నారు. శనగ మరియు దనియాలు కోత దశ, కోసే సమయంలో గింజ రంగు మారకుండా, బూజు తెగులు రాకుండా నివారించేందుకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు మరియు ప్లాంటామైసెస్ 1 గ్రాము 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శింగరాయకొండ వ్యవసాయ శాఖ అధికారి కెవి. శేషారెడ్డి, జిల్లా వనరుల కేంద్రం వ్యసాయశాఖ అధికారి వీరగంధం వెంకట శేషమ్మ, వివిఎలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టిజెఆర్‌పై దాడికి ఖండన

మద్దిపాడు : అసెంబ్లీలో సంతనూతలపాడు ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకర్ బాబుపై టిడిపి ఎమ్మెల్యే దాడి అమానుషమని వైసిపి మండల కన్వీనర్ ఎం.అప్పయ్య, బత్తుల శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యేపై దాడిని వారి ఖండించారు.

అసెంబ్లీలో ఎమ్మెల్యే స్వామిపై దాడి అమానుషం

టిడిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి- వెలింగడ్ల

అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యే డోలా బాలశ్రీ వీరాంజనేయ స్వామిపై వైసిపి ఎమ్మెల్యే సుధాకర్‌రావు, మరికొంత మంది ఎమ్మెల్యేలు దాడి చేయడం హేయమైన చర్య అని టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ స్వామిపై దాడిని నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు కర్నాటి భాస్కర్‌రెడ్డి, మండల తెలుగు రైతు అధ్యక్షుడు మీనిగా కాశయ్య, టిడిపి నాయకులు మొటాటి సుబ్బారెడ్డి, మాల కొండారెడ్డి, పండు, వాలిచర్ల శీను, పందెం రవి, ఖాసింపీరా, కె.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. **కొండపి :** అసెంబ్లీలో టిడిపి ఎమ్మెల్యేలపై దాడిని ఖండిస్తూ టిడిపి నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బి.యలమందనాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వహణ కార్యదర్శి ఆర్. మధుసూదనరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పొన్నలూరు :** అసెంబ్లీలో టిడిపి ఎమ్మెల్యే స్వామిపై దాడిని నిరసిస్తూ టిడిపి నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అనుముల సాంబశివరావు, ఉపాధ్యక్షుడు తానికొండ మహేంద్ర, మండల మాజీ అధ్యక్షులు మండల ప్రసాదు, కోటేశ్వరమ్మ, గట్టిపోయిన మల్లికార్జున, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పామూరు :** అసెంబ్లీలో టిడిపి ఎమ్మెల్యే డోలా శ్రీవీరాంజనేయస్వామి పై వైసిపి ఎమ్మెల్యేలు దాడి చేయడం అమానుషమని టిడిపి నాయకులు ఆరో పించారు. ఎమ్మెల్యే స్వామిపై దాడిని నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నాయకులు వినతిపత్రం అందజేసి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి. రామారావు, ఇర్రి కోటిరెడ్డి, మాల్యాద్రి, షేక్ రహంతుల్లా, రమణయ్య, శ్రీనివాసులు, సాంబయ్య, నారాయణ, వీరబాబు, శేషు, గంగరాజుయాదవ్, హుస్సేన్‌రావు యాదవ్, మోషే, సుబ్బారావు, మధు, ప్రసాద్‌రెడ్డి, గౌస్‌బాష, రమాదేవి, హరి పాల్గొన్నారు **కనిగిరి :** అసెంబ్లీలో టిడిపి ఎమ్మెల్యేలపై అధికారపక్ష ఎమ్మెల్యేలు దాడిని ఖండిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన సాగుతుందని తెలిపారు. దుర్మార్గపు పాలన సాగిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పామూరులో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సిఎం ప్రోద్బలంతో వైసిపి ఎమ్మెల్యేల దాడి

ఒంగోలు కలెక్టరేట్ : సిఎం వైఎస్ జగన్ ప్రోద్బలంతోనే వైసిపి ఎమ్మెల్యేలు దళిత ఎమ్మెల్యే డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామిపై దాడి జరిగిందని, ఈ దాడిని ఖండిస్తున్నట్లు టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగినేని రామారావు తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా శాసన సభ్యునిగా ఉన్న టిడిపి సీనియర్ నేత బుచ్చయ్య చౌదరిపై అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ దురుసు ప్రవర్తన హేయమైన చర్యని తెలిపారు. నేటి సభలో జరిగిన ఘటనతో జగన్ చరిత్ర హీనుడుగా మిగిలిపోతాడని, ఇలాంటి ముఖ్యమంత్రిని ఎక్కడా చూడలేదన్నారు. చట్టసభలకు మచ్చ తెచ్చిన సిఎంగా జగన్ నిలిచిపోతాడని, స్వయంగా సభలో ఎమ్మెల్యేలపై దాడికి దిగడం వైసిపి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. తద్వారా వైసిపి సిద్ధాంతం ఏంటో ప్రజలకు పూర్తిగా అర్థం అవుతుందన్నారు.

ఆశావర్కర్ల వినతి

ప్రజాశక్తి-వెలిగండ్ల

ఆశా వర్కర్ల నియామకాలు చేపట్టాలని ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాణి, కాకర్ల ధనలక్ష్మి కోరారు. వెలిగండ్ల పిహెచ్‌సిలో ఎస్‌హెచ్‌ఒ కోటిలింగంకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్ల నియామకాల్లో రాజకీయ జోక్యం ఉండకూడదన్నారు. ప్రభుత్వ సెలవులు, ఇన్సూరెన్స్ రిటైర్మెంట్ సౌకర్యాలు కల్పించాలన్నారు. మరణించిన ఆశా వర్కర్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఆర్.మాలకొండయ్య, వై.జయలక్ష్మి, ఫాతిమాబి తదితరులు పాల్గొన్నారు.

వంట సామగ్రి అందజేత

ప్రజాశక్తి - గిద్దలూరు

దేవస్థానం అభివద్ధికి దాతలు ముందుకు రావడం అభినంద నీయమని కాశినాయన దేవస్థానం నిర్వాహకులు చిన సుబ్బారావు నాయన తెలిపారు. నగర పంచాయతీలోని మోడం పల్లి వద్ద ఉన్న కాశినాయన దేవస్థానానికి మాజీ ఎంపిపి కడప వంశీధర్ రెడ్డి చేతుల మీదుగా రూ.20 వేల విలువైన వంట సామగ్రి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి కడప వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి వారం అన్నదానానికి వంట సామగ్రి లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి తాము వంట సామగ్రి అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలు, పజ్జెల శివ, ఉమా మహేశ్వరరావు, గ్రంధి రాజేష్, పసుపులేటి శ్రీనివాస్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దంత సమస్యలపై అవగాహన

ప్రజాశక్తి-కంభం రూరల్

వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా స్థానిక ఆది ఆంధ్ర పాఠశాలలో సామాజిక ఆరోగ్య కేంద్ర దంత వైద్యులు డాక్టర్ ఆరతి భూషణ్ మరియు వైద్య సిబ్బంది దంత సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దంత సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల వద్ద నుంచి వై. జంక్షన్ వరకూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఆర్థో వైద్యుడు డాక్టర్ విజయ్ చందర్, హెడ్ నర్స్ పద్మావతి , సామాజిక ఆరోగ్య అధికారి హబీబ్ ఖాన్ , ఆరోగ్య పర్యవేక్షకులు రవీంద్ర బాబు , వెంకటమ్మ ,మాధవి , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-దర్శి

స్థానిక షిర్డిసాయిబాబా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దర్శికి చెందిన నారపశెట్టి పాపయ్య వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాపయ్య సతీమణి నాగమల్లేశ్వరి, కుమారుడు ఆదినారాయణ, వెంకటలక్ష్మి, పవన్‌తేజ పాల్గొన్నారు.

23న జాబ్ మేళా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

స్థానిక శ్రీ గౌతమి డిగ్రీ కళాశాలలో ఈ నెల 23న ఐసిఐసిఐ బ్యాంకు ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ కనుమర్ల గుండారెడ్డి, ప్రిన్సిపాల్ రవిబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రిలేషన్ షిప్ మేనేజర్ పోస్టుకు సంబంధించి బిఎ, బికాం, బిఎస్సీ కోర్సులో 50 శాతం మార్కులతో పాసై వుండాలన్నారు. పది, ఇంటర్‌లో 50 శాతం మార్కులతో పాసై ఉండాలని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

సచివాలయాల్లో తనిఖీ

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

మండల పరిధిలోని చిన్న దోర్నాల, కట్టకానిపల్లె గ్రామ సచివాల యాలను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి డాక్టర్ బి.రవీంద్రారెడ్డి సోమవారం సందర్శించారు. చిన్న దోర్నాల సచివాలయంలో రికార్డులు సక్రమంగా నిర్వహించక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.రికార్డుల నిర్వహణపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. సచివాలయ సిబ్బంది ప్రజలు అందుబాటులో ఉండి వారికి మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సహాయకులు షేక్ లాల అహ్మద్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-వెలిగండ్ల

ప్రతిభా పరీక్షల ద్వారా విద్యార్థుల్లోని భయాన్ని పోగొట్ట వచ్చని మార్కాపురం డిప్యూటీ డిఇఒ ఎ.చంద్రశేఖర్‌రావు తెలిపారు. మండల పరిధిలోని మొగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ టాలెంట్ టెస్టుల ద్వారావిద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీయవచ్చునని తెలిపారు. టాలెంట్ టెస్ట్‌లో మొగులూరు హైస్కూల్‌కు చెందిన హరికష్ణ, పి.సురేష్ ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. వెలిగండ్ల హైస్కూల్‌కు చెందిన సాన చైతన్యలక్ష్మి తతీయ బహుమతిని సాధించింది. విజేతలకు డిప్యూటీ డిఇఓ ఎ.చంద్రశేఖరరావు, ఎంఇఒ దాస్‌ప్రసాద్, దాతలు డాక్టర్ కేసరి వెంకటేశ్వర్‌రెడ్డి, పచ్చువ మాధవరావు బహువ ఎతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజాల కొండారెడ్డి, ఉపాధ్యాయులు ఉడుముల వెంకటేశ్వర్‌రెడ్డి, షేక్ ఖాదర్‌మోహిద్దీన్, సిఆర్‌పిలు కొండలరావు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ డిఇఒ

యల్లేష్‌కు కరోనా వారియర్ అవార్డు

ప్రజాశక్తి -పెద్ద దోర్నాల

పెద్ద దోర్నాల ఎంపిపి గుమ్మా పద్మజ భర్త యల్లేష్ యాదవ్ కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా ఉంటూ నిత్యావసర వస్తువులు, మాస్కులు, శానిటైజర్లు, పిపిఇ కిట్లు, మందులు, కూరగాయలు అందించడం లాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆ సేవలకు గుర్తింపుగా ది లీడర్స్ పేజీ సంస్థ యల్లేష్‌ను కరోనా వారియర్ అవార్డును ఎంపిక చేసింది. ఆదివారం రాత్రి మార్కాపురం వచ్చిన హోం శాఖ మంత్రి తానేటి వనిత, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున చేతులు మీదుగా కరోనా వారియర్ అవార్డు, పొలిటికల్ బయోడేటా బ్రోచర్‌ను యల్లేష్ యాదవ్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ది లీడర్స్ పేజీ సంస్థ యాజమాన్య నిర్వాహకులు బొల్లు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు : సర్పంచి

దర్శి : తాళ్ళూరు మండలం విఠలాపురం గ్రామ పంచాయతీలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టనున్నట్లు గ్రామ సర్పంచి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి తెలిపారు. గ్రామ సచివాలయంలో గ్రామ పంచాయతీ పాలక వర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ వేసవికాలంలో తాగునీటికి ఇబ్బందిలేకుండా పంచాయితీ పరిధిలో అవసరమైన చోట బోర్లు వేసి కొళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.వార్డు సభ్యులుతో చర్చించి సమస్యలు పరిష్కారానికి సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నూరెళ్ల, మాజీ సర్పంచి సాల్మన్‌రాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-పిసిపల్లి

పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ అభివద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉపాధి హామీ పథకంలో మండలంలో నమోదైన కూలీలందరూ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద సమీప బ్యాంకుల్లో తమ పేర్ల నమోదు చేసుకోవాలని ఎంపిడిఒ డి.వి.రమణారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెదఅలవలపాడు గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. 17 నుంచి 70 సంవత్సరాల వయసు లోపు వారు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం చేరేందుకు అర్హులని తెలిపారు. ఏడాదికి రూ.20 చెల్లించి ఈ బీమా పథకంలో చేరవచ్చునని తెలిపారు.

ఆర్‌టిసి సేవలు వినియోగించుకోవాలి

జోనల్ చైర్మన్ బత్తుల సుప్రజా రెడ్డి

శింగరాయకొండ : ఆర్‌టిసి సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆర్‌టిసి నెల్లూరు జోనల్ చైర్మన్ బత్తుల సుప్రజా రెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లా కందుకూరు ఆర్‌టిసి డిపో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విహార యాత్రలకు సంబంధించిన పోస్టర్‌ను శింగరాయకొండలోని తన నివాస గృహంలో సుప్రజారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 4.4.2023న కందుకూరు డిపో నుంచి అరుణాచలం, 6.4.2023 కర్ణాటక యాత్ర, 1.5. 2023న షిరిడీ యాత్రకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యాత్రికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఉగాది పండుగ సందర్భంగా కొండపి మండలం జాళ్ళపాలెం తిరునాళ్ల కందుకూరు డిపో నుంచి నడిపే ఆర్‌టిసి బస్సులకు పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలని కొండపి సిఐ మాతంగి శ్రీనివాసరావును ఫోన్ ద్వారా సూచించారు. ప్రయాణికులు, బస్సులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందుకూరు డిపో మేనేజర్ పెద్దన శెట్టి , ఆర్‌టిసి అధికారులు పాల్గొన్నారు.



పోస్టల్ ను ఆవిష్కరణ చేస్తున్నా చైర్మన్ బత్తుల సుప్రజా రెడ్డి

సంతనూతలపాడు విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - సంతనూతలపాడు రూరల్

మండల పరిధిలోని పేర్నమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న రావూరి దుర్గ అనే విద్యార్థిని తయారు చేసిన ఉమెన్ సేఫ్టీ అండ్ ట్రాకింగ్ సిస్టం అనే సైన్స్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ ప్రాజెక్టుకు గైడ్ టీచరుగా పిఎస్ఎన్.మూర్తి వ్యవహరించారు. దుర్గ తయారుచేసిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల రావూరి దుర్గ, గైడ్ టీచర్ మూర్తి, సైన్స్ ఉపాధ్యాయులు సుబ్బారావు, కె. భరత్, స్వర్ణలతలను హైస్కూల్ ప్రధానో పాధ్యాయురాలు ప్రమోద, ఉపాధ్యాయులు అభినందించారు.


సత్వర న్యాయం అందాలి: ఎస్‌పి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను జిల్లా ఎస్పీ అందుకున్నారు. పిటీషనర్ల బాధలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల పరిధిలోని అధికారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చట్ట పరిధిలో విచారణ జరిపి, నిర్దిష్ట గడువులోపు చర్యలు తీసుకొని, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని, సదరు నివేదికను జిల్లా పోలీస్ కార్యాలయానికి నిర్దిష్ట గడువులోపు అందించాలని అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమానికి కుటుంబ కలహాలు, ఆర్థిక నేరాలు, భూ తగాదాలు మరియు ఇతర సమస్యలపై 49 ఫిర్యాదులు వచ్చినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ స్పందన కార్యక్రమంలో డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ బాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల జీతాలివ్వాలి

ప్రజాశక్తి-వేమూరు

గ్రామ పంచాయతీ కార్మికులకు వేతన బకాయిలు వెంటనే ఇవ్వాలని గ్రామ పంచాయ తీ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు బి అగస్టీన్ డిమాండ్ చేశారు. సోమవారం వేమూరు తహశీల్దారు కార్యాలయం వద్ద కొద్దిసేపు నిరసన తెలియజేసి అనంతరం తహశీల్దార్ శ్రావణ్ కుమార్‌కు, ఎంపిడివో సునీతలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అగస్టీన్ మాట్లా డుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు, పంచా యతీ కార్మికులకు 24 నెలలు బకాయిలున్నా యని, 2 సంవత్సరాలు వేతనాలు ఇవ్వకపోతే ఏమి తిని పనిచేయాలని ప్రశ్నించారు. కార్మిక లు జీతాలు రాక వడ్డీలకు అప్పులు చేసి అప్పులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని, వీరంతా దళితులు, గిరిజనులు, బిసిలకు చెందిన పేదల ను, పెరుగుతున్న ధరల నిత్యావసర సరుకుల ధరలతో పౌష్టికాహారం తినలేక నిరంతరం జబ్బులబారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2021లో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు నెలకు రూ.10 వేలు వేతనం ఇస్తామని 680 జిఒ ఇచ్చిందని, కానీ అమలు జరగలేదని విమర్శించారు. కనీసం చేతులు కడుక్కోటానికి సబ్బులు, కొబ్బరినూనె, ఏకరూప



వేమూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

బట్టలు కూడా ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వేతన బకాయిలు ఇప్పించాలని, ప్రభుత్వం జారీ చేసిన జీఓ 132, 680 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు పి సురేష్, కార్యదర్శి కె నాగేశ్వరరావు, మండల నాయకులు పి రమేష్, పి రవి, రాంబాబు, సామ్రాజ్యం, సుశీల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన కళాశాల పాలకవర్గం

ప్రజాశక్తి-బాపట్ల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించిన అకడమిక్ 2023 ఎగ్జిబిషన్‌లో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలకు ద్వితీయ బహుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌కె నజీర్ తెలిపారు. సోమవారం ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించామ న్నారు. ఈ సందర్భంగా బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటి అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల సాంకేతిక పరిణితికి నిదర్శనమన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగిన ఎగ్జిబిషన్‌లో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలకు విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించడం గర్వకారణమన్నారు. కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌కు విద్యార్థులను సన్నద్ధం చేయటంలో అధ్యాపకుల నిరంతర కృషి నూతన ప్రయోగాల ఫలితమేన న్నారు. ఈ సందర్భంగా ఇసిఇ, సివిల్, ఇఇఇ విభాగంలో విజేతలైన విద్యార్థులను అందుకు సహకరించిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటి ఉపాధ్యక్షులు దొప్పలపూడి రామ్మోహనరావు, జి దిలీప్, సంయుక్త కార్యదర్శి కె హరి పద్మ ప్రసాద్, కోశాధికారి టి రామకృష్ణ, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, సిహెచ్ నాగ సతీష్, జి రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి పట్టణ అధ్యక్ష పదవికి నరాలశెట్టి రాజీనామా

ప్రజాశక్తి-బాపట్ల



బాపట్ల పట్టణ వైసిపి అధ్యక్ష పదవికి నరాలశెట్టి ప్రకాశరావు రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, 2002లో కోన రఘుపతి రాజకీయాల్లోకి రావడంతో అప్పటి పరిస్థితుల దృష్ట్యా రాజకీయంగా తన ప్రయాణాన్ని కోన వెంటే కొనసాగించానని పేర్కొన్నారు. ప్రస్తుతం వైసిపిలో తనకు ఎదురవుతున్న ఇబ్బందుల కారణంగా పట్టణ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి వైసిపి కార్యకర్తగా కొనసాగుతానని పేర్కొన్నారు. వైసిపిలో కార్యకర్తగా కూడా వద్దు అనుకుంటే తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిపోతానన్నారు. చెప్పుడు మాటలు విని శాసనసభ్యులు కోన రఘుపతి ఎవరు ఏంటి అనేది గుర్తించలేకపోతున్నారని పేర్కొన్నారు. పార్టీలో ఆయన వెంటే 20 ఏళ్లుగా రాజకీయంగా ప్రయాణం చేస్తున్నానని, ఏదన్నా విషయం ఉంటే నాతో నేరుగా మాట్లాడాలి గాని మధ్యవర్తుల పమేయం ఎందుకని ఆయన ప్రశ్నించారు. లేనిపోని అభూత కల్పనలు సృష్టించి చెప్పే వారి మాటలే ఆయన నమ్ముతున్నారన్నారు. అపవాదులు రాకముందే పదవి నుంచి తప్పుకుంటున్నానని ప్రకాశరావు తెలిపారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన మేదరమెట్ల విద్యార్థులు

ప్రజాశక్తి-మేదరమెట్ల: సోమవారం జిల్లా స్థాయిలో బాపట్లలో ఈఎండిపి ప్రాజెక్ట్ కాంపిటీషన్లో కొరిశపాడు మండలం మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం సాయి, జి చరణ్ తేజ, జి సాయి తేజ రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికయ్యారు. వీరు ఈ నెల విజయవాడలో 24వ తేదీన జరిగే పోటీలలో పాల్గొంటారు. వారి ఉపాధ్యాయుడైన కె పోతురాజును డీఈవో రామారావు, ఈఎండి పి ఎండి రమణ, డిఎస్‌ఓ సాదిక్, వివిధ శాఖ అధికారులు అభినందించారు.

కొండపి ఎమ్మెల్యేపై దాడికి నిరసన

ప్రజాశక్తి-పర్చూరు

తెలుగుదేశం పార్టీ కొండపి శాసనసభ్యులు డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిపై జరిగిన దాడికి నిరసనగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పర్చూరు బొమ్మల సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. దాడి ప్రజాస్వామ్యంపై జరిగిందిగా నేతలు అభివర్ణించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, మానం హరిబాబు, ధూళిపల్లి వెంకటస్వామి, శ్రీరాం వెంకటసుబ్బారావు, అప్పలనేని వెంకటేశ్వర్లు, దాసరి రామకృష్ణ, గ్రంధి వెంకటరమణ, దాసరి రామకృష్ణ, తలారి పోతురాజు, గోరంట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-పర్చూరు: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని మండలంలోని నాగులపాలెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి విశ్వరాణి ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 23వ తేదీ ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు.

దెబ్బతిన్న పంటలు.. ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-నగరం

ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మండల పరిధిలో 2 వేలు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేయగా పంటలు 70 రోజుల నుంచి 90 రోజుల మధ్య కాలంలో ఉన్నాయి. వర్షం ప్రభావంతో పంట సాళ్లలో నీరు నిల్వ ఉండటం వల్ల భూమిలో ఉన్న కాయలు కుళ్లిపోతాయని ఆవేదన చెందుతున్నారు. మినుము పంట చేలు ఓదెల మీద ఉన్నాయని రైతులు బాధపడుతున్నారు. నగరం మండలంలోని వివిధ గ్రామాలలో అధిక వర్షాల వలన దెబ్బ తిన్న పొలాలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు అక్తర్ హుస్సేన్ మాట్లాడుతూ వేరుశెనగ మరియు అపరాల పంటలలో అధిక వర్షపు నీరు చేరి ఉంటే నీటిని తొలగించి పైరుపై లీటరు నీటికి పది గ్రాముల అన్నబేధి, ఒక గ్రాము నిమ్మ ఉప్పు మరియు పది గ్రాముల యూరియా పిచికారీ చేయవలెను. మొక్కజొన్న మరియు జొన్న పంటలలో వర్షపు నీటిని



పొలంలో పంటను పరిశీలిస్తున్న ఏడి

తొలగించి పెరుగుదల దశలో వున్న పంటలో ఒక బస్తా యూరియా అర బస్తా పొటాష్ చేల్లో వేయవలెను. అని సూచించారు. అదే జొన్న మరియు మొక్క జొన్న కండె దశలో ఉన్నట్లైతే కంకి బూజు మరియు ఇతర తెగుళ్ళ వ్యాప్తి చెందకుండా ఏకరానికి 250 మి లీ ప్రోపికోనజోల్ (టిల్ట్) లేదా 500 మి లీ హెక్సా కొనజోల్ (కాంటాఫ్) పిచికారీ చేసుకోవలెను. అని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వేమూరి రమేష్‌బాబు వీఏఎన్ కిరణ్మయి గ్రామ రైతులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్



మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రభుత్వం నిర్దేశించిన సమయం లోపల జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలు పూర్తి చెయ్యాలని ఎంపీడీవో సిహెచ్ కృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో గృహ నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేస్తున్న 22వ తేదీ ఉగాది పండుగ పర్వదిన రోజు జగనన్న కాలనీలో నూతన గృహ ప్రవేశాలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 120 గృహ ప్రవేశాలకు అధికారులు చురుగ్గా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా సొంత స్థలాలలో నిర్మాణాలు పూర్తిచేసిన వారు కూడా గృహ ప్రవేశాలు చేసేందుకు సిబ్బంది చొరవ చూపాలన్నారు. జగనన్న కాలనీలలో సకల సౌకర్యాలు కల్పించే విధంగా అధికారులు, గ్రామాల్లోని సర్పంచులు, ఎంపీటీసీలతో మమేకమై త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాలలో పారిశుధ్య పనులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా, రోడ్ల పక్కనే ఎరువు దిబ్బల పోయకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఈఓపిఆర్డి సీతామాలక్ష్మి, హౌసింగ్ ఏఈ, వెలుగు ఏపిఎం తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 6 అర్జీలు: ఆర్‌డిఒ

ప్రజాశక్తి-రేపల్లె

ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి రేపల్లె వేమూరు నియోజకవర్గాల్లోని ప్రజలు సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డివో జగన్నాథం పార్థసారథి అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో స్పందనతో ప్రజా సమస్యలను పరిష్కరించే గ్రీవెన్స్ నిర్వహణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో పార్థసారథి మాట్లాడుతూ 6 అర్జీలు కొత్తగా వచ్చాయని వీటిని ఆయా శాఖ అధికారులకు పరిష్కరించేందుకు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టుకు ఖండన

ప్రజాశక్తి-రేపల్లె

ప్రజా సమస్యలపై పోరాడుతున్న ఉద్యమకారుల అక్రమ అరెస్టులు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని సిపిఐ నాయకులు పి నాగాంజనేయులు, గొట్టుముక్కల బాలాజీ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజల హక్కులను కాలరాస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చీకటి జిఒను రద్దు చేయాలని కోరుతూ చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లనీయకుండా సిపిఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాని తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాక ముందు ఒక, మాట అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో సిపిఐ రేపల్లె, వేమూరు నియోజకవర్గం కార్యదర్శులు గొట్టుముక్కల బాలాజీ, బండారు శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు ముత్యాల వెంకటేశ్వర్లు, చొక్కాకుల శివ శంకర్, సిరంశెట్టి శ్రీనివాసరావు, ఓబులశెట్టి రమేష్, వి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కుంకలమర్రులో 'కిమ్స్' వైద్య శిబిరం

ప్రజాశక్తి-కారంచేడు

మండలంలోని కుంకలమర్రు గ్రామంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య రంగంలో ప్రకాశం జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కిమ్స్ హాస్పిటల్ ఒంగోలు వారు. జువ్వా చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో పర్చూరు వైసిపి ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్, పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జువ్వా శివరాం ప్రసాద్ సహాయ సహకారాలతో కుంకలమర్రు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం నిర్వహించారు. ఈ శిబిరంలో ఉచితంగా మందుల పంపిణీ, కంటికి సంబంధించిన పరీక్షలు నిర్వహించి, ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి గుండె, కిడ్నీ ,విష జ్వరాలు లాంటి వ్యాధులకు వైద్యులు, పేషంట్లకు తగు జాగ్రత్తలు చెప్పారు. రోగ నిర్ధారణ జరిగిన 150 మంది పేషంట్లకు ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈహెచ్ఎస్, కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తామని కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు. ఈ క్యాంపులో డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ ప్రీతి, ఆప్తమాలజిస్ట్ రాణి కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది, మొదలగు వారు పాల్గొన్నారు. 350 మందికి పైగా చికిత్స పొందారు. ఈ కార్యక్రమంలో కుంకలమర్రు పంచాయతీ కార్యదర్శి అంజయ్య స్థానిక అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, పంచాయతీ సిబ్బంది సహాయ సహకారాలు అందించారు.

విద్యార్థినులకు పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పర్చూరు బాలికోన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థినులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. రోటరీ సభ్యులు నర్రా వెంకటేశ్వరరావు, లక్ష్మీ సుధల ఆర్థిక సహాయంతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడి చదివి పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, తోకల కృష్ణమోహన్, గడ్డిపాటి శ్రీనివాసరావు, కాసా అశోక్, కొల్లా సుబ్బారావు, పి వెంకన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్ అవని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేమంతా అర్హులమే..

అన్యాయం చేయొద్దంటూ నిర్వాసితుల వేడుకోలు..



సరళావందనంకు ఆధారాలు చూపిస్తున్న నిర్వాసితులు

ప్రజాశక్తి-మార్కాపురం

పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ ముంపు గ్రామాల్లో దళారులదే రాజ్యంగా మారింది. పెద్దారవీడు మండలం, సుంకేసుల గ్రామానికి చెందిన అర్హులైన నిర్వాసితులను సైతం కొందరు దళారులు తమ మాట వినడం లేదని, అవసరమైన మేర ముడుపులు ఇవ్వడం లేదని సాకులు చూపి.... ఏకంగా నిర్వాసితులు జాబితా నుంచి అర్హులను తొలగించారు. మాట వినని వారు.. అర్హులే కాదంటూ అధికారులకు సైతం ఫిర్యాదులు చేశారు. పెద్దారవీడు మండలంలోని సుంకేసుల గ్రామంలో సఫీవుద్దీన్‌తో పాటు పలువురు నిర్వాసితులు అదే గ్రామంలో నివాసం ఉంటున్నారు. వారు పుట్టి పెరిగిన గ్రామం కూడా అదే. నూటికి నూరు శాతం వారు నిర్వాసితులు. అన్ని ఆధారాలూ వారి వద్ద ఉన్నాయి. కొందరు దళారులు చేసిన ఫిర్యాదులతో అధికారులు నోటీసులు జారీ చేశారు. 'మీరు అనర్హులంటూ మాకు ఫిర్యాదులు అందాయి. మీ వద్ద ఏమైనా ఆధారాలు ఉంటే నిరూపించుకోండి. లేనిపక్షంలో నిర్వాసితుల జాబితా నుంచి తొలగించబడతారు' అని హెచ్చరికలు జారీ చేశారు. దళారుల మాట వినని వారిలో ఆందోళన మొదలైంది. అర్హులైన తమకు ప్యాకేజీ ఎక్కడ అందకుండా పోతుందోనని ఆవేదనలో మునిగారు. తగిన ఆధారాలతో వారంతా ఒంగోలులోని వెలుగొండ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ సరళవందనాన్ని సోమవారం కలిసి ఆధారాలతో పాటు జరిగిన వాస్తవాన్ని వివరించారు. తమకు మీరే న్యాయం చేయాలంటూ వేడుకున్నారు.

జిల్లాలో ప్రాధాన్యత పనుల

అమలుకు చర్యలు

కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా యంత్రాంగం ప్రాధాన్యత పనులు అమలు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో వెనుకబకుండా జిల్లాను ప్రగతిపథం వైపు నడిపించాలన్నారు. స్పందన అర్జీలు, 'జగనన్నకు చెబుదాము' అర్జీలను గడువులోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఖాళీలను 1:3 చొప్పున పిల్లలను ఎంపిక చేసి పాఠశాలలకు పంపాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి, మత్స్యశాఖ జెడి సురేష్, పశుసంవర్ధక శాఖ జెడి హనుమంతరావు, వ్యవసాయ శాఖ జెడి అబ్దుల్ సత్తార్, డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, పంచాయతీరాజ్ ఎస్.ఇ శ్రీనివాస్, పౌరసరఫరాల శాఖ డి.ఎస్.ఓ విలియమ్స్, డి.ఎం శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు



మాట్లాడుతున్న పమిడి వెంకటరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చుకునేందుకు ఈనెల 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రకాశం జిల్లా కమిటీ సమావేశం స్థానిక ఎల్‌బిజి భవన్‌లో గాలి వెంకటరామిరెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పమిడి వెంకటరావు మాట్లాడుతూ 2021 డిసెంబర్‌లో ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె మాబు మాట్లాడుతూ రైతులు గిట్టుబాటు ధరలు లేక వ్యవసాయానికి దూరమవుతున్నారని, రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయన్నారు. జుజ్జూరు జయంతి బాబు, పెంట్యాల హనుమంతరావు మాట్లాడుతూ అదానీ ప్రజలను నిలువునా మోసం చేస్తున్నా, రాష్ట్రంలో భూములు కేటాయించటం దుర్మార్గమన్నారు. సమావేశంలో రైతుల గిట్టుబాటు ధరల కోసం జరిగే ఛలో ఢిల్లీ ర్యాలీకి రైతాంగాన్ని విస్తృతంగా సమీకరించాలని తీర్మానించారు. సమావేశంలో కనపర్తి సుబ్బారావు, వెంకట్రామిరెడ్డి, కె.చిన్నపురెడ్డి, కె.శ్రీనివాస రెడ్డి, బెజవాడ శ్రీను, ముప్పరాజు బ్రహ్మయ్య, పరిటా ఏడుకొండలు, ఎర్రయ్య, అబ్బూరి వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు.

టిడిపి ఎమ్మెల్యేలపై దాడి దుర్మార్గం

పలుచోట్ల తెలుగు తమ్ముళ్ల నిరసన



శింగరాయకొండలో మానవహారంలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అసెంబ్లీలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలపై వైసీపీ ఎమ్మెల్యేలు దాడి చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్యని టిడిపి జిల్లా నాయకులు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి లపై దాడిని ఖండిస్తూ జిల్లా టిడిపి నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్ళపై నిలబడి నిరసన తెలియజేశారు. నిరసన కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, బిసి సాధికారత సమితి రాష్ట్ర నాయకులు పిల్లుట్ల సుధాకర రావు, చుండి శ్యామ్, నండూరి చంద్ర, నావూరి కుమార్, పసుమర్తి హగ్గయ్యరాజ్, కసుకుర్తి అంకరాజు, కార్పొరేటర్ సంద్రపాటి వర్ధ్వర్త్, తెలుగు మహిళ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షురాలు రావుల పద్మజ, ప్రధాన కార్యదర్శి బీరం అరుణ పాల్గొన్నారు.

శింగరాయకొండ: అసెంబ్లీలో కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిపై అధికారపార్టీ ఎమ్మెల్యేల దాడికి నిరసనగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసే యత్నం చేయగా శింగరాయకొండ ఎస్ఐ ఫిరోజా ఫాతిమా , జరుగుమల్లి ఎస్ఐ శ్రీనివాసరావు అడ్డుకున్నారు. దిష్టిబొమ్మ దహనం చేస్తే కేసులో నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్కడ తెలుగుదేశం పార్టీ నాయకులు ధర్నాకి దిగి.. ఆర్టీసీ బస్టాండ్ నుంచి కందుకూరు రోడ్డు వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం కందుకూరు రోడ్డు వద్ద మానవహారం నిర్వహించి.. నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చీమకుర్తి కష్ణ, కూనపురెడ్డి వెంకట సుబ్బారావు, మందలపు గాంధీచౌదరి, మించల బ్రహ్మయ్య, షేక్ సనావుల్లా, షేక్ అబ్దుల్‌సుభాన్, షేక్ యస్దాని, పులి ప్రసాద్, ఇమ్మడిశెట్టి రామారావు, పసుపులేటి శేషు, నక్క బ్రహ్మేశ్వరరావు, కల్లగుంట నరసింహ, మేకల నరేష్, వలేటి రవిశంకర్‌రెడ్డి, సన్నెబోయిన మాలకొండయ్య, శీలం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తడవర్తి వాసు

సంప్రదాయాలకు నెలవు 'రామ్‌రాజ్ కాటన్'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రామ్‌రాజ్ కాటన్ దుస్తులు సంస్కృతి సంప్రదాయాలకు ఆలంబనగా నిలుస్తాయని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ అధ్యక్షులు తడవర్తి వాసు పేర్కొన్నారు. సోమవారం నాడు ఒంగోలులోని కర్నూలు రోడ్డు పవర్ ఆఫీసు ఎదురుగా సంస్థ నెలకొల్పిన తొలి ఔట్ లెట్‌ను ప్రారంభించారు. వస్త్రవ్యాపారుల సంఘ కార్యదర్శి బివి సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేశారు.

అంగన్‌వాడీల అక్రమ అరెస్టులు దుర్మార్గం

సాగర్ సెంటర్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లిన అంగన్‌వాడీ వర్కర్స్, సిఐటియు నాయకులను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయటం దుర్మార్గమని సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు తెలిపారు. అక్రమ అరెస్టులను ఖండిస్తూ సిఐటియు ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సాగర్ సెంటర్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి మహేష్ అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ మొన్న శాసనమండలికి జరిగిన ఎన్నికల్లో అధికార పార్టీపై గ్రాడ్యుయేట్ ఓటర్లు అసంతృప్తిని చూపించారని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఉద్యోగులు కార్మికులు, అంగన్వాడీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు సిహెచ్.చిరంజీవి, సిఐటియు నగర అధ్యక్షులు చిలుకూరి రాంబాబు, సిఐటియు నగర ఉపాధ్యక్షులు జి.రమేష్, శ్రీరామ శ్రీనివాసరావు, ఎస్‌డి హుస్సేన్, శ్రీనివాసరావు, పి.సుబ్బారావు, తేళ్ల విజయ, కె.బాలకష్ణ, కె.మోహన్‌రావు, ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి, నగర నాయకులు జి.ఆదిలక్ష్మి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం పాల్గొన్నారు.

దంత వ్యాధులపై అవగాహన



డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్థానిక రంగారాయుడు చెరువు వాకింగ్ ట్రాక్‌లో వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా దంత వ్యాధులపై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. కార్యక్రమానికి జిజిహెచ్ దంత వైద్యవిభాగం హెచ్ఒడి, డాక్టర్ నామినేని కిరణ్ కుమార్ దంతవ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏ ఆహారం తిన్నా.. కాఫీ, టీ తాగిన వెంటనే నోటిలో నీళ్లు పోసుకుని పుక్కిలించి వేయాలన్నారు. ప్రతిరోజూ రెండుసార్లు బ్రష్ చేయాలని, స్మూత్ బ్రష్‌నే వాడాలన్నారు. ఒక్క నిమిషం లేదా రెండు నిమిషాలు మాత్రమే వాడాలని, బ్రష్ వాడే విధానాన్ని కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాకా హనుమ రెడ్డి, వైసిపి నాయకులు, ఆర్‌ఎంపి జిల్లా అధ్యక్షులు బట్టు బాలాజీరావు, సీనియర్ సభ్యులు భాస్కర్ మాలకొండయ్య, పట్టణంలోని వివిధ ఆర్‌ఎంపిలు, ఆర్‌ఎంపి మహిళా కమిటీఅధ్యక్షులు ఆంథోని, కార్యదర్శి శాంతి పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా ముఠా అరెస్టు



మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

విశాఖపట్నంలోని స్టీల్ ప్లాంట్ ఏరియాలో ఉన్న అటవీ ప్రాంతం నుంచి నిందితులు గంజాయి ఉన్న నాలుగు పెద్ద బస్తాలు తీసుకొని వచ్చి కారులో చెన్నై తీసుకెళుతున్న క్రమంలో పోలీసులు బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద తనిఖీలలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. సోమవారం బాపట్ల క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి వివరాలు వెల్లడించారు. ఈ నెల 19న పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు 140 కిలోల గంజాయితో వెళుతున్న కారును స్వాధీనం చేసుకొని.. అందులో ఉన్న ముద్దాయిలు అల్లూరి సీతారామరాజు జిల్లా, కొండసంత గ్రామానికి చెందిన కర్రి దార బాబు, శరభవరం గ్రామానికి చెందిన లగిజే ఈశ్వర వరప్రసాద్, వెలగలపాలెం గ్రామానికి చెందిన వేమలపూడి గవాస్కర్ అలియాస్ తేజ అనే ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌పి తెలిపారు. మార్టూరు సిఐ షేక్ టి.ఫిరోజ్, మార్టూరు యస్ఐ కమలాకర్ వారి సిబ్బంది కలిసి మార్టూరు ఇన్‌ఛార్జి తహశీల్దారు బి.వెంకటరెడ్డి మరియు మధ్యవర్తుల సమక్షంలో బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేసి.. ముగ్గురు ముద్దాయిలను, కారులో అక్రమంగా తరలిస్తున్న నాలుగు తెల్లని ప్లాస్టిక్ గోతాలలో ఉన్న 140 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు తెలియజేశారు. గంజాయిని స్వాధీనం చేసుకోవటంలో ప్రతిభ కనపరిచిన మార్టూరు సిఐ షేక్ టి.ఫిరోజ్ , వారికి సహకరించిన మార్టూరు యస్.ఐ కమలాకర్, ఎఎస్ఐ యస్.కె సైదా, పి.వి. సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్ యి.కోటేశ్వరరావు, జి.ప్రసాద్, డి.రాజేష్ ను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించి.. వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

అంతరాష్ట్ర దొంగలు అరెస్ట్

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగలను అరెస్టు చేసి.. వారి నుంచి రూ 18.50 లక్షల విలువైన 322 గ్రాముల బంగారు ఆభరణాలు, 1 కేజీ 350 గ్రాముల వెండి వస్తువులు, ద్విచక్ర వాహనంను స్వాధీనం చేసుకున్నట్లు బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. బాపట్ల డిఎస్పీ ఏ.శ్రీనివాసరావు నేతృత్వంలో బాపట్ల జిల్లా క్రైమ్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఎమ్.మురళికష్ణ , బాపట్ల పట్టణ ఇన్స్పెక్టర్ పి.కష్ణయ్య ల సారథ్యంలో దొంగతనం కేసుల్లో నిందితులుగా ఉన్న మచిలిపట్నంకు చెందిన శొంఠి దుర్గారావు, గుంటూరుకు చెందిన పులి రమేష్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. విచారణలో నిందితులు బాపట్ల పట్టణంలో మార్చి ఆరున అర్ధరాత్రి ఓల్డ్ పోస్టఆఫీస్ రోడ్డులో గల ఒక ఇంటిలో, మార్చి 8వ తేది అర్ధరాత్రి హనుమంతరావు కాలనీలో గల ఒక ఇంటిలో దొంగతనాలు చేసినట్లు అంగీకరించారు. మార్చి 5వ తేదీన అర్ధరాత్రి చీరాల రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపేటలో ఒక ఇంటిలో, మార్చి 1వ తేది అర్ధరాత్రి ఏలూరులోని సత్రంపాడు, ఎమ్ఆర్‌సి కాలనీలోని ఒక ఇంటిలో దొంగతనాలకు పాల్పడినట్లు నేరం అంగీకరించారు. కేసు దర్యాప్తులో ఉత్తమ ప్రతిభ కనపర్చిన బాపట్ల పట్టణ సిఐ పి.కృష్ణయ్య, బాపట్ల సీసీఎస్ సిఐ ఎం.మురళీకృష్ణ, ఎస్ఐ రఫీని అభినందించి.. రివార్డులు అందజేశారు.